# మహిళా సాధికారత

MAHILA SADHIKARATHA

స్వయంసహాయ ఉద్యమ సమాచార తెలుగు మాసపత్రిక


mas

సంపుటి :18 సంచిక: 2 రంగారెడ్డి అక్టోబర్ 2019 పేజీలు : 36 వెల : రూ. 10/-


## మహా మానవతావాది , ఆదర్శ ఐ ఏ ఎస్ మహాభినిష్క్రమణం !

యుగంధర్ మరణంతో ఒక యుగం అంతరించింది.

-అనిల్ స్వరూప్, విశ్రాంత ఐఏఎస్ ఉత్తరప్రదేశ్



బి. ఎన్. యుగంధర్

ఐ ఏ ఎస్ అధికారులలో ఆయన కలికి తురాయి !

- ఎస్ కె జోషీ తెలంగాణా సిఎస్



**పీడిత జనులు, పెగలని గొంతుకల పక్షాన పోరాడిన యోధుడు**

– బి.రాజశేఖర్, ఐఏఎస్, విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం

**అరుదైన ఐఏఎస్ అధికారి, గొప్ప మానవతావాది**

– ఆకునూరి మురళి, విశ్రాంత ఐఏఎస్ అధికారి, తెలంగాణా

**అసాధారణ మానవతా వాది, పేదలకోసం అసమాన పోరాటశీలి**

– కె.సంధ్యారాణి, ఐఏఎస్, విద్యాశాఖ కమిషనర్, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం

**మహా మనీషి , క్రియాశీల ఎన్ జి ఓ లకు వెన్నుదన్ను**

– సి ఎస్ రెడ్డి, ఎండి, సి ఇ ఓ ఏపిమాస్ ; ఎడిటర్–మహిళాసాధికారత

**సహచరులకు స్ఫూర్తిప్రదాత, నిరాడంబరతకు నిర్వచనం**

– వెంగళరెడ్డి, 'కమిట్‌మెంట్స్' ట్రస్టీ మాజీ సి ఇ ఓ



కొన్ని జ్ఞాపకాలు !



కమిట్‌మెంట్స్ సమావేశంలో దివ్యాంగులతో ఆత్మీయంగా...



'మాస్' సదస్సులో మాజీ ముఖ్యమంత్రి శ్రీ కిరణ్ కుమార్ రెడ్డి తో పాటు ...


Brot für die Welt బ్రెడ్ ఫర్ ది వరల్డ్ సౌజన్యంతో

# ' మాస్ ' నిర్వహణలో వివిధ కార్యక్రమాల చిత్రమాలిక



ఆజీవ మహిళా ఎఫ్ పి సి ద్వితీయ వార్షిక మహాసభ



ధీశాలి మహిళా ఎఫ్ పి సి ద్వితీయ వార్షిక మహాసభ



కర్నూలు ఎఫ్ పి ఓ డైరెక్టర్లకు శిక్షకుల శిక్షణ



గుంతకల్లు ఎఫ్ పి ఓ డైరెక్టర్ల సమావేశం



కామారెడ్డి జిల్లాలో బీహార్ బృందం అవగాహన పర్యటన



# నివాళి

సంపాదకీయం

**మొ**న్న సెప్టెంబర్ 13 వ తేదీన కన్ను మూసిన శ్రీ బుక్కాపురం నాదెళ్ళ యుగంధర్ ఐ ఏ ఎస్ అధికారులలో ఒక ఆణిముత్యంలాంటి వారు. అరుదైన వ్యక్తిత్వం, అసాధారణమైన అంకితభావం, పేదలన్నా, నిస్సహాయులన్నా ఎడతెగని మమకారం, వారి బాగుకోసం ఏదో ఇంకేదో చేయాలని, చేయించాలని నిరంతరం ఆరాటం; తాను ఆశించిన విధంగా, రూపొందించిన ప్రణాళికలకు అనుగుణంగా ప్రభుత్వాలు, కొందరు అధికారులు, తగినంతగా స్పందించడం లేదన్న అసహనం; నమ్మిన సిద్ధాంతంకోసం ఎంతటివారినైనా నిలదీసే నిబ్బరం, నిజాయితీ; కలసినడిచే సహచరులలో నిత్య స్ఫూర్తిని నింపే అసాధారణమైన అవగాహన, వివేచన, ఆదర్శనాయకత్వం; అధికార ఆర్భాటమంటే ఎంతమాత్రమూ గిట్టని నిరాడంబరత్వం, పూర్తిగా సమాజసేవకే అంకితంచేసుకున్న పరిపూర్ణ జీవితం ఆయనది.

ఆ మహనీయునితో కలసి అడుగులువేసే గొప్ప అవకాశం నాకు 20 ఏళ్లకు పైగా లభించడం ఒక గర్వకారణం. నేను ' కేర్ ' సంస్థలో పనిచేస్తున్నప్పటినుంచే ఆయనతో పరిచయం వున్నా 1999–2001 మధ్యకాలంలో 'మహిళాభివృద్ధి సొసైటీ' (ఏపిమాస్) ఏర్పాటు సన్నాహాల సమయం నుంచి యుగంధర్ గారితో పరిచయం గాఢమై ఆరాధనగా, ఆత్మీయంగా మారింది. ఏపిమాస్ సంస్థ స్వరూప స్వభావాలు ఎలా వుండాలనే విషయమై ఆయన ఎన్నో సూచనలుచేశారు, సలహాలు ఇచ్చారు. శ్రీ టక్కర్, శ్రీ కొప్పుల రాజు, శ్రీ స్మరజిత్ రే వంటి ఇతర పలువురు ప్రముఖులతో పాటు నాటి సన్నాహక చర్చలలో ఆయనకూడా ఎంతో ఉత్సాహంగా పాల్గొనేవారు. సన్నాహక సలహా సంఘంలో ఆయన సభ్యులుగా వుండేవారు. ఏపిమాస్ అంటరానితనం, అంగవైకల్యం వంటి సామాజిక సమస్యలపై సేవలు అందించాలని ఆయన ఆకాంక్షించారు. కాని, మహిళా సాధికారత అనే ప్రధాన అజెండాతో ఏర్పాటైనందువల్ల యుగంధర్‌గారు సూచించిన అంశాలకు ఏపిమాస్‌లో చోటు కల్పించడం సాధ్యంకాలేదు. కాని, మహిళా స్వయంసహాయ ఉద్యమాన్ని బలోపేతం చేయడంద్వారా, మహిళా సాధికారతకు, పేదిక నిర్మూలనకు, లైంగిక అసమానతలను కొంతమేరకు సరిదిద్దడానికి ఏపిమాస్ చేస్తున్న కృషికి ఆయన సంపూర్ణ మద్దతు ఇస్తుండేవారు. ఏపిమాస్ నిర్వహించిన అనేక సదస్సులలో, వర్క్‌షాప్‌లలో ఆయన పాల్గొని సలహాలు ఇస్తుండేవారు. ఏపిమాస్ సంస్థకు ఆయన చేసిన మరో గొప్ప సహాయం ' ఏపిమాస్ అధ్యయన కేంద్రం ' (లెర్నింగ్ సెంటర్) నిర్మాణానికి ప్రణాళికా సంఘం నుంచి ఐదు కోట్ల రూపాయలు ఇప్పించడం. ఆ తోడ్పాటుతోనే ఏపిమాస్ హైదరాబాదులో ప్రధాన కార్యాలయ భవనాన్ని , అధ్యయన కేంద్రాన్ని నిర్మించుకుని, ముమ్మరంగా శిక్షణలు ఇవ్వగలుగుతున్నది.

యు ఎన్ డి పి ప్రాజెక్ట్ కింద ' సపాప్ ' (దక్షిణ ఆసియా పేదరిక నిర్మూలన ప్రాజెక్ట్), దాని నుంచి 'సెర్ప్' (గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ), ఆ ఆశయాన్ని బలోపేతంచేసే లక్ష్యంతో ఎన్ ఆర్ ఎల్ ఎం (జాతీయ గ్రామీణ జీవనోపాధుల మిషన్) ... ఇలా ఎన్నెన్నో కీలకమైన ప్రాజెక్టుల రూపకల్పనలో యుగంధర్ గారిది ప్రధానపాత్ర. వాటర్‌షెడ్ మార్గదర్శక సూత్రాలకు ఆయనే రూపకర్త. పేదలకోసం, నిస్సహాయులకోసం ఉద్దేశించిన ప్రభుత్వ సామాజిక కార్యక్రమాలు ఎన్ జి ఓ ల తోడ్పాటుతోనే సక్రమంగా సాగుతాయని ఆయన విశ్వసించేవారు. అందుకే వాటర్‌షెడ్ కార్యక్రమాల నిర్వహణలో 20 శాతం ఎన్ జి ఓ లకు భాగస్వామ్యం కల్పించాలని ఆయన నిర్దేశించారు. అందుకే, జి ఓ–ఎన్ జి ఓ ల అనుసంధానం కోసం, స్వయంసహాయ ఉద్యమాన్ని మెరుగుపరచడం కోసం ఏపిమాస్ చేసిన కృషిని, ఆయన ఎంతో మెచ్చుకున్నారు.

వాసన్, కమిట్‌మెంట్స్ వంటి ప్రజోపయోగ సంస్థల ఏర్పాటులోనూ ఆయనదే కీలక **(మిగతా 13వ పేజీలో)**

Edited, Printed, Published and owned by **T.Chandra Sekhar Reddy;** Printed at Kala Jyothi Process Pvt.Limited, S No:185, Kondapur, Hyderabad-500133, Ranga Reddi District, Telangana;Published at Mahila Abhivruddhi Society, Andhra Pradesh (APMAS), Plot No.11&12,HUDAColony, Tanesha Nagar, Near DreamVally,Manikonda,Rangareddi District,Hyderabad-500089. **Editor:**T.**Chandra Sekhar Reddy**

మనం మన ఆలోచనలకు బందీలం, ఆలోచనలను మార్చుకోనిదే మనం దేనినీ మార్చలేం

## లోపలి పేజీలలో ....


- ఆదర్శానికే ఆదర్శం యుగంధర్ జీవితం ! ...05
- యుగంధర్ విశిష్ట జీవనం ... కొన్ని విశేషాలు ! ...06
- పీడితుల పక్షాన పోరాడిన యోధుడు! ...08
- అణగారిన వర్గాల సాధికారత కోసం అంకితం ...09
- అసాధారణ మానవతావాది, అసమాన పోరాటశీలి !...10
- అరుదైన ఐ ఏ ఎస్ అధికారి, గొప్ప మానవతావాది ...12
- ఆజీవ మహిళా ఎఫ్ పి సి రెండవ వార్షిక మహాసభ ...14
- ధీశాలి ఎఫ్ పి సి ద్వితీయ వార్షిక మహాసభ ........15
- జై కిసాన్ ఎఫ్ పి ఓ చేపట్టిన కార్యక్రమాలు ! ...16
- పండుగను తలపించిన జి.ఐ.జడ్ బృంద పర్యటన! ...18
- పౌష్టికాహారం - ఇంటింటి వ్యవహారం ! ...20
- మూడు నెలలలో కుట్టు పనిలో నైపుణ్యం ! ...21
- వ్యవసాయాన్నే ఉపాధిగా ఎంచుకోవాలి... ...22
- ఎడారి చెరువైంది, ఊరు ఉద్యానమైంది ! ...23
- మూడు చెక్కల గొర్రుతో కూలీల ఖర్చు సగం! ...25
- చిరుధాన్యాల సాగులో మహిళా రైతులు ! ...26
- ప్రకృతి సేద్యానికి జోడీగా సేంద్రియ యూరియా ! ...27
- పది పంటలపై నంద్యాల ఆర్ఏఆర్ఎస్ పరిశోధన ...29
- ఐదు సిరి ధాన్యాలతో ఆరోగ్యం పదిలం ! ...31
- సిరి ధాన్యాలను వైద్యానికి జోడించి ... ! ...32
- హరిత నవీకరణ కేంద్రాలపై సదస్సుకు మాస్ ఎం డి...34


### మహిళా సాధికారత ప్రోత్సాహక చందా

| ఏడాదికి | రెండేళ్లకు | మూడేళ్లకు |
|---|---|---|
| రూ.110 | రూ.200 | రూ.280 |

### ప్రకటన ఛార్జీలు

| | |
|---|---|
| మల్టీకలర్ ఫస్ట్ పేజి (సగం): | రూ. 25,000 |
| మల్టీకలర్ బ్యాక్ పేజి (పూర్తి): | రూ. 25,000 |
| మల్టీకలర్ ఇన్‌సైడ్ కవర్ పేజి (పూర్తి): | రూ. 15,000 |
| బ్లాక్ అండ్ వైట్ లోపలి పేజి (పూర్తి): | రూ. 10,000 |

- చందాలు లేదా ప్రకటనలకోసం పంపే చెక్కులను, డిడిలను 'ఏపిమాస్-హైదరాబాద్' పేరుమీద మాత్రమే పంపాలి


ఎడిటర్ : టి. చంద్రశేఖర రెడ్డి

అసోసియేట్ ఎడిటర్: జె.వి. క్రిష్ణమూర్తి

ఎడిటోరియల్ కమిటి:

ఏ. కళామణి, ఎస్. రామలక్ష్మి,

ఎన్.వినాయకరెడ్డి, బి.వెంకటేశ్వర్లు

కంపోజింగ్, డిజైనింగ్

ఎన్. రమాదేవి

కన్సల్టెంట్ కె.రఘురామరాజు


గమనిక: 'మహిళా సాధికారత' అనంతమైన భిన్నత్వం నుంచి ఆశావహమైన ఏకత్వానికి వేదిక. ఈ పత్రికలో ప్రచురించే రచనలలో వ్యక్తమయ్యే అభిప్రాయాలు పత్రికా నిర్వాహకుల అభిప్రాయాలు కాకపోవచ్చు.


**మహిళా సాధికారత**

ఏపిమాస్ కార్యాలయం,

ప్లాట్ నెం.11-12, హుడా కాలని,

తానీషా నగర్, డ్రీమ్ వ్యాలీ దగ్గర,

మణికొండ, రంగారెడ్డి జిల్లా,

హైదరాబాదు-500089

ఫోన్స్ : 08413-403118/19/20

ఫాక్స్ : 08413-403117

Web:www.apmas.org

E Mail: info@apmas.org

# ఆదర్శానికే ఆదర్శం యుగంధర్ జీవితం !

**అరుదైన ఐ ఏ ఎస్...పేదలకు, దివ్యాంగులకు నిరుపమాన సేవ...నిరాడంబరతకు చిరునామా !!**



**ఆ**యన ఆరడుగులకు మించిన పొడగరి! ఆయన వ్యక్తిత్వం అంతకు ఎన్నెన్నో రెట్లు మిన్నగా, గిరిశిఖరంలా సమున్నతం. పొడవు వల్ల కొంత సన్నగా కనిపించినా ఆయన మరీ బక్కపలచటి మనిషేం కాదు. తాను నమ్మిన సిద్ధాంతాన్ని, తాను మంచిదనుకున్న విధానాన్ని ఆచరించడంలో, ఆచరింపజేయడంలో నిష్కర్షగా ముందడుగు వేయడంతప్ప, రాజీపడి వెనకడుగు వేయడం ఎరుగని ముక్కుసూటి మనిషి. పేదరికంపట్ల, పేదల సాధికారత ఆవశ్యకతపట్ల తేలికభావంతో వుండేవారంటే ఆయనకు పరమ చిరాకు. అటువంటివారు ఎవరైనా, ఎంతవారైనా వారిపట్ల తన అసహనాన్ని దాచుకోలేని ధర్మాగ్రహం ఆయనది. ఏ పదవిలో వున్నా, ఏ స్థాయిలో వున్నా పేదల సంక్షేమం కోసం అహర్నిశలు పరితపించి, అనేక పథకాలను రూపొందించి, వారి జీవితాలలో వెలుగులు నింపడానికి అవిశ్రాంతంగా కృషిచేసిన మహనీయుడు ఆయన. నూటికొక్కడు, కోటికొక్కడు అన్నట్టు తన ఉద్యోగ జీవితమంతా, పదవీ విరమణానంతరం దాదాపు మరణ పర్యంతం కూడా పేదలతోడిదే లోకంగా, పేదల పెన్నిధిగా జీవించిన అతి కొద్దిమంది ఐఏఎస్ అధికారులలో ఆయన పేరెన్నికగన్నవాడు. ఆయనే సెప్టెంబర్ 13 వ తేదీన తన 82 వ ఏట హైదరాబాదులో కన్నుమూసిన శ్రీ బుక్కాపురం నాదెళ్ళ యగంధర్ !

ఆడంబరం, పటాటోపం, ఆర్భాటం, ప్రచారం బొత్తిగా గిట్టని శ్రీ యుగంధర్‌ను గురించిన వ్యక్తిగత విశేషాలు అంతగా ఎవరికీ తెలియవు. ఆయన అనంతపురం జిల్లాకు చెందిన వారని,బుక్కాపురం ఆయన స్వగ్రామమని చెబుతారు. తిరుపతి శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయంలో చదువుకుని మొదట కొంత కాలం లెక్చరర్‌గా పని చేశారట. అనంతరం ముందు ఐపిఎస్‌కు ఆ తర్వాత ఐ ఏ ఎస్ కు ఎంపిక అయ్యారట. కలెక్టర్ గా మొదలుపెట్టి ఐక్యరాజ్యసమితి, అంతర్జాతీయ ద్రవ్య నిధి (ఐ ఎం ఎఫ్), ప్రధాని కార్యాలయం, ప్రణాళికా సంఘం వంటి ఎన్నో ఉన్నతోన్నత సంస్థలకు ఆయన సేవలందించారు. పేదలు, దివ్యాంగుల జీవితాలలో వెలుగులు నింపడమే జీవితాశయంగా పెట్టుకున్న శ్రీ యుగంధర్ అందుకోసం వాసన్, కమిట్‌మెంట్స్ వంటి సంస్థలను నెలకొల్పారు. స్వయంసహాయ మహిళల అభ్యున్నతి కోసం కృషిచేయడానికి ఏర్పడిన ఏపిమాస్ తోపాటు అనేక స్వచ్ఛందసంస్థలకు తోడ్పాటు అందించారు.

అంతకంటె మిక్కిలిగా ఆయన సమాజానికి చేసిన మహోపకారం కొందరు ఐ ఏ ఎస్ అధికారులలో, ఎన్ జి ఓ ల ప్రతినిధులలో, ఇతర మరికొందరిలో తన మాదిరిగా ఆలోచించి తపనపడగలిగే స్ఫూర్తిని రగిలించడం. ఎంతటి మహనీయులైనా తరతరాలుగా పేరుకుపోయిన సామాజిక కాలుష్య క్షాళన ఏ ఒక్క వ్యక్తితోనో, ఏ ఒక్క రోజులోనో అయ్యేది కాదు. ఆదర్శానికే ఆదర్శంగా జీవించిన శ్రీ యుగంధర్‌నుంచి స్ఫూర్తిపొందిన వారు కొద్దిమందే అయినా, 'గంగిగోవు పాలు గంటెడైనను చాలు ...' అన్నట్టు ఆయన ఆశయాలను ముందుకు తీసుకువెళ్ళ గలిగితే ఈ సమాజంలో ఆయన నిత్య సజీవుడే!

'నాస్తి తేషాం యశ:కాయో జరా మరణజం భయం'! కీర్తి శరీరానికి మరణమెక్కడిది? ముసలితనమెక్కడిది? ■

నిన్ను నీవు తెలుసుకోవడం , తెలుసుకుని మలచుకోవడం వివేకానికి మొదటి మెట్టు

# యుగంధర్ విశిష్ట జీవనం ... కొన్ని విశేషాలు !

*యుగంధర్ గారిని గురించి పలువురికి తెలియని అనేక విశేషాలతో ఆంధ్రజ్యోతి ఢిల్లీ ప్రతినిధి శ్రీ ఎ. కృష్ణారావు 20019 సెప్టెంబర్ 25 వ తేదీ సంచికలో ' యుగంధర్‌ల యుగం అంతరించిందా? ' అనే శీర్షికన ఒక వ్యాసం రాశారు. ఆ వ్యాసంలోని కొన్ని భాగాలను 'ఆంధ్రజ్యోతి' సౌజన్యంతో మహిళా సాధికారత పాఠకులకోసం ప్రచురిస్తున్నాం.*

---

◆ ప్రధాన మంత్రిగా పి.వి. నరసింహారావు ఉన్న కాలంలో విశాఖపట్టణానికి చెందిన ప్రముఖ రచయిత చలసాని ప్రసాద్ ఢిల్లీకి వచ్చారు. మాటల మధ్యలో తాను యుగంధర్ దగ్గరకి వెళ్లానని, గిరిజనుల గురించి చాలా విషయాలు చర్చించానని చెప్పినప్పుడు నేను ఆశ్చర్యపోయాను. ప్రధానమంత్రి కార్యాలయంలో ప్రత్యేక కార్యదర్శిగా పనిచేస్తున్న ఒక ముఖ్యమైన అధికారి వద్దకు విప్లవ రచయితల సంఘంలో ఉన్న చలసాని ప్రసాద్ వెళ్ళడం, ఇద్దరు సన్నిహితంగా మాట్లాడుకోవడం ఇవాళ్టి రోజుల్లో అయితే ఊహించలేని విషయం. ఆ రోజుల్లో ప్రజలకు సంబంధించిన ముఖ్యమైన సమస్యలను పరిష్కరించేందుకు ఐఏఎస్ అధికారులు నిజాయితీగా కృషి చేయడం, రకరకాల కోణాలనుంచి అధ్యయనం చేయడం జరిగేది. బహుశా గిరిజనుల గురించి ఏ సమస్యను పరిష్కరించదలచుకున్నారోగానీ చలసాని ప్రసాదును యుగంధర్ పిలిచి మాట్లాడారు.



◆ నక్సలైట్ ఉద్యమం తీవ్రంగా ఉన్న కాలంలో శ్రీకాకుళం జిల్లా కలెక్టర్‌గా పనిచేసిన యుగంధర్‌కు నిజమైన పేదరికం ఏమిటో, దాన్ని నిర్మూలించేందుకు వాస్తవికతా దృక్పథంతో విధానాలు ఎలా రూపొందించాలో బాగా తెలుసు. దేశంలో కనీస వేతనాలు, వెట్టి చాకిరి నిర్మూలన, గ్రామీణ పేదలను రుణ విముక్తులను చేయడంపై విధానాలు రూపొందించారు. కేరళలో వెట్టి చాకిరి నుంచి విముక్తి అయిన వారి కోసం తేయాకు తోటల కేటాయింపు నుంచి జమ్మూకశ్మీర్‌లో గ్రీన్ హౌజ్ ప్రాజెక్టు వరకు అత్యవసరం అనుకున్న ప్రాజెక్టుల విషయంలో పేదల కోసం నిధులు కేటాయించేందుకు ఆయన వెనుకాడేవారు కాదు. వికేంద్రీకృత ప్రణాళికలు రూపొందించేందుకు అంతరిక్ష ఆధారిత సమాచారం కోసం ఆయన ఇస్రో ద్వారా అతి పెద్ద ప్రాజెక్టును అమలు చేశారు. వికేంద్రీకృత ప్రణాళిక, భూసంస్కరణలు, రాజ్యాంగ నైతికతపై చెప్పుకోదగిన రచనలు చేశారు. 'అంతరిక్షం అనేది సంపన్నుల కోసం కాదు, అది గ్రామాలకు చేరాలి' అని యుగంధర్ అనేవారని ఆయనతో పనిచేసిన ఒక ఐఏఎస్ అధికారి ఆయనకు నివాళి అర్పిస్తూ రాశారు.

◆ తాను జిల్లాల్లో కలెక్టర్‌గా ఉన్నప్పుడు పేదలకు భూములను పంపిణీ చేసేందుకు వెనుకాడని యుగంధర్, ఎన్టీఆర్ హయాంలో రూ. 2 కిలో బియ్యం వంటి పథకాలకు రూపకల్పన చేసి దేశంలో ప్రజాపంపిణీ వ్యవస్థలోనే విప్లవాత్మక మార్పులకు శ్రీకారం చుట్టారు. ప్రధాని పి.వి. నరసింహారావు హయాంలో కీలక బాధ్యతలు చేపట్టిన తర్వాత ఆయన మొత్తం దేశాన్ని దృష్టిలో ఉంచుకుని ప్రజా పంపిణీ వ్యవస్థను పటిష్ఠం చేయడం, వాటర్ షెడ్ అభివృద్ధి ప్రాజెక్టులకు నేరుగా కేంద్రం నుంచి నిధులు అందేలా చేయడం వరకు పలు చర్యలు తీసుకున్నారు. పేదల జీవితాల్లో వెలుగులు ప్రసరించేందుకు యుగంధర్ అనేక కేంద్ర ప్రాయోజిత పథకాలను ప్రతిపాదించారు. అధికార వికేంద్రీకరణ ద్వారానే ప్రజలకు ఫలితాలు అందుతాయని భావించిన అధికారుల్లో ఆయన ఒకరు.

◆ యుగంధర్‌తోపాటు దేశంలో అత్యంత నిరుపేదల బతుకుల్లో వెలుగులు ప్రసారించేందుకు ఎస్.ఆర్.శంకరన్, కె.బి.సక్సేనా, ఎ.ఆర్.బందోపాధ్యాయ, బి.డి.శర్మ, కె.ఆర్. వేణుగోపాల్ వంటి ఐఏఎస్ అధికారులు రాత్రింబగళ్లు తమ

కలలు లేని జీవితం లేదు; కలలు అంతరించిన జీవితం రెక్కలు విరిగిన పక్షిలాంటిది

వ్యక్తిగత జీవితాలను కూడా త్యాగం చేసి కృషి చేశారు. పేద ప్రజలకు అందుబాటులో ఉండడం కోసం ఎస్.ఆర్.శంకరన్ వివాహం కూడా చేసుకోలేదు. 1988లో పీపుల్స్ వార్ గ్రూప్ నాడు ప్రిన్సిపల్ సెక్రటరీగా ఉన్న శంకరన్, తూర్పు గోదావరి జిల్లా కలెక్టర్‌గా ఉన్న వి.కె.సి.శాస్త్రి, రంపచోడవరం సబ్ కలెక్టర్‌గా ఉన్న రెడ్డి సుబ్రహ్మణ్యంతోపాటు ఏడుగురు ఐఏఎస్ అధికారులను కిడ్నాప్ చేసినప్పుడు యుగంధర్ రాష్ట్ర పరిశ్రమల కార్యదర్శిగా ఉన్నారు. తనకు ఈ పరిణామంతో సంబంధం లేకపోయినా రంగంలోకి దిగారు. అప్పటి ఛీఫ్ సెక్రటరీ శ్రావణ్ కుమార్‌ను ఒప్పించి తన మిత్రుడైన పౌర హక్కుల నేత కన్నభిరాన్‌ను, ఆయన ద్వారా పొత్తూరి వేంకటేశ్వరరావు, హరగోపాల్ ప్రభృతులను రంగంలోకి దించారు. స్వయంగా రాజమండ్రికి, అటవీ ప్రాంతానికి వెళ్లి ఐఏఎస్ అధికారులు విడుదలయ్యేలా, నక్సల్ ఖైదీలకు బెయిల్ వచ్చేలా చూశారు.

◆ 1995లో యుగంధర్ రూపొందించిన జాతీయ సామాజిక సహాయ కార్యక్రమం దేశంలో జాతీయ వృద్ధాప్య పింఛను విధానాన్ని ప్రవేశపెట్టేందుకు దారి తీసింది. 'పింఛన్లు లేకుండా చేయలేమా?' అని ఒక అధికారి ప్రశ్నించినప్పుడు 'మనం వృద్ధాప్యం లేకుండా చేయలేమా?' అని యుగంధర్ ఎదురు ప్రశ్నించారట. 'ఒక వృద్ధ మహిళ చేతుల్లో కొన్ని వందల రూపాయలు పడితే ఆమె కళ్లలో ఆనందం ఎలా ఉంటుందో మీకు తెలియదు. ఆమె కోసం ఈ పింఛను వస్తున్నంత వరకూ కనీసం ఆమెను ఇంటి నుంచి పిల్లలు తరిమేయలేరు' అని చెప్పిన యుగంధర్ సామాన్య బతుకులను ఎంత దగ్గరి నుంచి పరిశీలించారో అర్థమవుతుంది. వృద్ధులకోసమే కాదు దివ్యాంగులకోసం కూడా ఆయన చట్టాల్ని రూపొందించారు.

◆ 'నేను యువకుడిగా ఉన్నప్పుడు నా తల్లిదండ్రులకు అంతగా చేయలేకపోయాను. నాకు సంపాదన పెరిగాక మా ఇంట్లో పరదాలు వేయించాలనుకున్నాను. అప్పటికి నా తండ్రి ఎంతో వృద్ధుడయ్యాడు. నేను ఏమి చేసినా ఆయన అనుభవించే పరిస్థితి దాటిపోయారు' అని యుగంధర్ తన తోటి ఐఏఎస్ అధికారి వద్ద వాపోయారట.

◆ యుగంధర్‌ను కారు, బంగళా, హోదా ఎప్పుడూ ఆకర్షించేవి కావు. తన జేబులో రాజీనామా ఉన్నట్లుగా ఆయన వ్యవహరించేవారు. అలాంటి వ్యక్తి కుమారుడు సత్య నాదెళ్ల ఇవాళ మైక్రోసాఫ్ట్ ఛీఫ్‌గా వందలకోట్ల మేరకు వేతనం పొందుతున్నారని తెలిసినా ఆయన జీవితంలో వచ్చే మార్పు ఏముంటుంది? నిజానికి ప్రధానమంత్రి కార్యాలయంలో ఉన్నత స్థాయిలో ఉన్నప్పుడే సత్యనాదెళ్ల వివాహాన్ని తన ఐ ఏ ఎస్ సహచరుడు కెఆర్ వేణుగోపాల్ కుమార్తెతో అతి సాధారణంగా జరిపించారు. ఈ వివాహానికి తనను ఆహ్వానించకపోయినప్పటికీ ప్రధాని పివి చెప్పాపెట్టకుండా వెళ్లి ఆశీర్వదించారని వార్తలు వచ్చాయి.

◆ యుగంధర్ మరణంతో ఒక యుగం అంతమైంది. పేద ప్రజల పట్ల అంకిత భావం, ప్రతిభా నైపుణ్యాలతో ఆయనలా పనిచేసిన అధికారి మరొకరు లేరు.' అని ఉత్తర ప్రదేశ్‌లో ప్రజాదరణ పొందిన ఐఏఎస్ అధికారి అనిల్ స్వరూప్ ఆయనకు నివాళి అర్పించారు. ఈ మాటలు పూర్తిగా నిజం. ప్రధానమంత్రి ఆయుష్మాన్ భారత్‌కు ప్రేరణగా నిల్చిన రాష్ట్రీయ స్వాస్థ్య బీమా యోజనను రూపొందించిన అనిల్ స్వరూప్ తాను పదవీ విరమణ చేసిన తర్వాత ఇటీవలే 'నాట్ జస్ట్ ఏ సివిల్ సర్వెంట్' అనే పుస్తకాన్ని రచించారు. 'నిజాయితీగా ఉండడం అనేది గొప్ప విషయం కాదు. నిజాయితీగా ఉండడం ద్వారా నీవెవరికీ ఏదో మేలు చేసినట్లు కాదు. ఒక సివిల్ సర్వెంట్ నిర్ణయాలు తీసుకోవడమే కాదు, అవి అమలు జరిగేలా చూడాలి' అని అనిల్ స్వరూప్ అన్నారు. 'ఇవాళ దేశంలో ఉన్న పరిస్థితికి రాజకీయ నాయకులతో సమానంగా అధికారులను కూడా నిందించాలి' ఆయన అభిప్రాయపడ్డారు. చాలా మంది ఐఏఎస్ అధికారులు మార్పును ప్రతిఘటిస్తారని 'వాట్ ఎయిల్స్ ద ఐఏఎస్, వై ఇట్ ఫెయిల్స్ టు డెలివర్' అన్న పుస్తకంలో నరేశ్ చంద్ర సక్సేనా అనే మరో ఐఐఎస్ అధికారి రాశారు. వీరు అనుభవ పూర్వకంగా రాసిన మాటల్లో వాస్తవం లేకపోలేదు. ఇవాళ దేశంలో వేల కోట్లు ఖర్చు పెట్టినా పేదరికం ఇంకా తీవ్రంగా ఉన్నదంటే, రహదారులు దరిద్రంగా ఉన్నాయంటే, ప్రాథమిక విద్య, వైద్య రంగాలు దుర్భర స్థితిలో ఉన్నాయంటే, అనేక సామాజిక సూచికల విషయంలో మన దేశం ఇంకా వెనుకబడి ఉన్నదంటే, ఆదివాసీలకు వ్యతిరేకంగా విధానాలు రూపొందుతున్నాయంటే అందుకు రాజకీయ నాయకులతో పాటు ఐఏఎస్ అధికారులను కూడా నిందించక తప్పదు. ■

ఒప్పుకోలేని విషయాన్నయినా సహేతుకంగా విశ్లేషించడం మానసిక వికాసానికి సంకేతం

# పీడితులు, పెగలని గొంతుకల పక్షాన పోరాడిన యోధుడు!

*-బి.రాజశేఖర్, ఐ ఏ ఎస్, విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి, ఆంధ్రప్రదేశ్*

శ్రీ బి ఎన్ యుగంధర్ గారు 2019 సెప్టెంబర్ 13న మనలను వదిలిపెట్టి , ఆయనకు ఆత్మీయ మిత్రుడు, తత్వబోధకుడు, మార్గదర్శి శ్రీ శంకరన్ గారిని కలుసుకోవడానికి వెళ్ళిపోయారు. అక్కడ వారు ఇక మళ్ళీ పేదరికాన్ని గురించి, అణగారిన వర్గాలను గురించి, దివ్యాంగుల గురించిన చర్చలలో మునిగిపోతారు. వారిద్దరూ మానవ వ్యకిత్వానికి సంబంధించిన ప్రతి అంశంలో ఉప్పు నిప్పులాగా పరస్పర విరుద్ధంగా వుండేవారనేది జగమెరిగిన సత్యమే. అయితే, ఇంకా దోపిడీకి గురవుతున్న ఎస్ సి, ఎస్ టి వంటి అణగారిన వర్గాలకు సంబంధించిన విషయం వచ్చేసరికి మాత్రం ఒకే గుండెతో రెండు శరీరాలు అతుక్కుని పుట్టిన అవిభాజ్య కవలలుగా వారు వ్యవహరించేవారు. యుగంధర్ గారిలోని ఈ వ్యక్తిత్వ విశేషం గ్రామీణ, అభివృద్ధి రంగాలలోని వారికి బాగానే తెలిసినప్పటికి సామాన్య ప్రజల విషయానికి వచ్చేసరికి అప్పుడప్పుడూ ఊపిరి పీల్చుకోవడానికి కూడా ఇబ్బందికరమైన దగ్గుతో శిఖర సదృశమైన ఆ నిలువెత్తు మనిషి నోటినుంచి ఎటువంటి శషభిషలకు తావులేకుండా బుల్లెట్ లాగా దూసుకువచ్చే మాటల మాయాజాలం ఆ వ్యక్తిత్వ కోణాన్ని కప్పివేసేది. ఆయన పదవీ విరమణానంతరం ఈ తీవ్రమైన దగ్గు, దానితోపాటే వచ్చే ఇతర ఆరోగ్య సమస్యలే శ్రీ యుగంధర్ గారు దాదాపు ఏకాకి జీవితం గడపడానికి చాలావరకు కారణమయ్యాయి. ఆయనతో పరిచయం ఏర్పడిన ఐఏఎస్ ప్రొబేషనర్లకు, అసంఖ్యాకమైన ప్రభుత్వాధికారులకు, రాజకీయ నాయకులకు, ఎన్ జి ఓ ల ప్రతినిధులకు ఆయన సునిశితమైన బుద్ధి, సూక్ష్మాతి సూక్ష్మంగాకూడా దారి తప్పడాన్ని అంగీకరించని ఆయన కఠోర క్రమశిక్షణ తత్వం, అసాధారణ వృత్తి నైపుణ్యం చూడడానికి ఆయన స్వభావం ఒక ఇంద్రజాలంలా అనిపించేది. పేదరికపు వాస్తవిక లోతులను అర్ధంచేసుకోలేని, పేదరికంలో జీవించడం ఎంతటి దుర్భరమో గ్రహించలేని వారిపట్ల తనలో రేగే ఆగ్రహాన్ని కడుపులోనే దాచుకుని, మెరమెచ్చు మాటలు పలికే కుహనా సౌజన్యం ఆయనది కాదనే సంగతి కూడా అందరికీ తెలిసిందే. ఈ విషయాల గురించి నేను ఆయనతో చర్చించిన పలు సందర్భాలలో ఆయన గుండెల్లో గూడుకట్టుకున్న అసహనం,



కడుపులోదాచుకున్న ఆగ్రహం పెల్లుబికి 'పేదలపట్ల ఎంత సున్నితంగా వ్యవహరించాలో, పేదరికంనుంచి బయటపడడానికి వారికి సాధికారత ఎంత అవసరమో ఈ దద్దమ్మలు, గా.. ...లు ఎందుకు తెలుసుకోలేరో అర్ధంకాదు' అంటూ ఆయన తిట్లకు లంకించుకోవడం నేనెరుగుదును. పేదరికపు సమస్యలగురించిన ఆయన అవగాహన ఎంత సునిశితం, ఎంత మహోన్నతం అంటే ఆయన జీవితమంతా దుర్భర దారిద్ర్యాన్ని స్వయంగా అనుభవించి వుంటారని, అందువల్లనే ఆయన తన చుట్టూ వున్నవారు, ముఖ్యంగా ప్రభుత్వ యంత్రాంగంలోని వారు పేదరికపు నిజస్వరూపమేమిటో తెలుసుకోవాలని తపనపడుతున్నారని అనిపిస్తుంది. అయితే, ఇందుకు పూర్తిగా భిన్నమైన సామాజిక ఆర్థిక నేపధ్యం కలిగిన ఆయన జీవనం; ప్రధానమంత్రి కార్యాలయం, ప్రణాళికా సంఘం, యునెస్కాప్ వంటి ఉన్నతోన్నత పదవులతో కూడిన ఆయన జీవితానుభవాలు ఆ ఆలోచన తప్పని తేటతెల్లంచేస్తాయి.ఆయన జీవితంలోని చివరి ఐదేళ్ళలో ఆయన మనసును కలచిన ఆలోచనలు పెద్దగా ఏమీలేవు . అయితే, తన బాగోగులు చూసుకుంటున్న దళిత సంరక్షకుడు మల్లేశం కొడుకుకు ముందుగా ఏదైనా నైపుణ్య శిక్షణ యిప్పించి, తర్వాత ఉద్యోగం పొందేలా చేస్తే బాగుండునని ఆయన ఆరాటపడుతుండేవారు. యుగంధర్ గారితో నేను చివరిసారిగా మాట్లాడింది ఆయన తుదిశ్వాస విడవడానికి నాలుగు వారాల ముందు. ఎంతో లోగొంతుకతో, సరిగ్గా అర్ధమయ్యా కాని రీతిలో ఒక్కోమాట కూడబలుక్కుంటూ ఆయన నాకు

ఏడు సార్లు కిందపడినా ఎనిమిది సార్లు పైకి లేవగలగడమే జీవన రహస్యం

చెప్పాలనుకున్నది మల్లేశం కొడుకుకు తొందరగా తగిన ఉద్యోగం చూడమని. ఐస్ బాక్స్‌లో నిశ్చలంగా పడుకోపెట్టి వున్న కుంగిపోయిన ఆయన భౌతిక కాయాన్ని చూసినపుడు నా చెవులలో ఆయన చివరి మాటలే మారుమోగాయి. ఆ ఇంటి బయట కన్నీరు కారుస్తూ నిలబడిన మహబూబ్‌నగర్ దివ్యాంగ సంస్థ (పీపుల్ విత్ డిజెబిలిటీస్) ఎస్ హెచ్ జి మహిళలను చూసినప్పుడు అధికార హర్మ్యాల ప్రాంగణాలలో అలవోకగా తిరుగాడిన ఈ కీర్తిశిఖరం మహబూబ్‌నగర్ జిల్లా కోస్గిలో ఒక గుడిసెలో పొట్టి మట్టి నేలమీద మానసిక విలాంగ (సెరిబ్రల్ పాల్సీ) బాలలతో కలసి ఆటలాడిన రోజులు గుర్తుకువచ్చి కళ్ళు చెమర్చాయి. శంకరన్ గారితో కలసి యుగంధర్ గారు ప్రత్యేకంగా దివ్యాంగులకోసం, వారి సాధికారత లక్ష్యంగా 'కమిట్‌మెంట్స్' అనే లాభార్జనతో నిమిత్తంలేని సంస్థను ఏర్పాటు చేశారనే విషయం తెలిసిందే. ఐక్యరాజ్య సమితీలో పదవికి సంబంధించి తనకు వచ్చే పెన్షన్ మొత్తాన్ని కమిట్‌మెంట్స్ సంస్థకు మూలధనంగా ఆయన ఉదారంగా ఇచ్చేశారు. ఈ మహనీయుని పార్థివ దేహానికి మహాప్రస్థానం శ్మశానవాటికలో అంతిమ సంస్కారం జరిగిన రోజున ఆయనకు కడసారి శ్రద్ధాంజలి ఘటించడానికి వచ్చినవారిలో కమిట్‌మెంట్స్ వల్ల ఉపయోగం పొందివారే అత్యధిక సంఖ్యలో వుండడం సమాజంలోని అణగారిన వర్గాలపట్ల ఆయన తన అంకితభావాన్ని ఎంతగా ఆచరణలో చూపారనడానికి నిలువెత్తు నిదర్శనం. పేదల సంస్థల శక్తిసామర్థ్యాలపట్ల , స్వయంసహాయ మార్గంలో పేదరికం నుంచి బయటపడడానికి వారు రూపొందించుకున్న కార్యాచరణ విధానంపట్ల ఆయనకు వున్న ప్రగాఢ విశ్వాసం నుంచి స్ఫూర్తిని పొందగలగడమే గుండెనిండా బంగారం నింపుకున్న ఈ అసాధారణ ఐఏఎస్ అధికారికి మనం ఇవ్వవలసిన అసలైన నివాళి. దేశంనుంచి ఈ దుస్థితిని పారద్రోలడానికి అసహనంతో కూడిన ప్రేమావేశం కావాలన్నదే ఆయన జీవితం ప్రపంచానికి ఇచ్చే సందేశం.

యుగంధర్ గారూ, మీ ఆత్మకు శాంతి కలుగు గాక! అదెప్పుడో మీరు సంపాదించుకున్నారు!

■

## అణగారిన వర్గాల సాధికారత కోసం ఆయన జీవితం అంకితం !

**జి.వెంగళరెడ్డి, ట్రస్టీ, కమిట్‌మెంట్స్**

**యు**గంధర్ గారితో, వారి ఆప్త మిత్రుడు శంకరన్ గారితో దాదాపు 20 ఏళ్ళపాటు కలసి పనిచేయడం నాకు చాలా గర్వకారణమైన విషయం. వారి ఆచరణ పంథా వేరుగా వుండేది కాని , ఆశయం మాత్రం ఒక్కటే ! సమాజంలో బాధితులు, పీడితులకు సాధికారత సాధించడమే ఆ మహదాశయం! యుగంధర్ గారు సామాన్య ప్రజలతో ఎంత సౌమ్యంగా, విధేయంగా వుంటారో అణగారిన వర్గాల సాధికారత సంకల్పాన్ని వ్యతిరేకించేవారి పట్ల అంత కటువుగా వుండేవారు. ఆ సాధికారత మార్గాన్ని అనుసరించని వారు ఏ హోదాలో వున్నా, ఎంతటివారైనా వారిపట్ల తన అసంతృప్తిని వెలిబుచ్చడానికి ఆయన ఎంతమాత్రం సంకోచించేవారు కాదు. 200-2001 సంవత్సరంలో హైదరాబాదులో జరిగిన ఒక సమావేశంలో ప్రపంచ బ్యాంక్ అధికారులపై ఆయన తీవ్రంగా ఆగ్రహించిన సందర్భానికి నేను ప్రత్యక్ష సాక్షిని! అభివృద్ధి రంగానికి సంబంధించిన పుస్తకాలను ఆయన నిరంతరం చదువుతుండేవారు. ఆయనతో ఒక్క గంట మాట్లాడితే చాలు వంద పుస్తకాలు చదివిన జ్ఞానం మనకు వస్తుంది. ఇక ఆయనతో కలసి ఒక్క ఏడాది పనిచేస్తే అభివృద్ధి రంగం పట్ల మన అవగాహనను పెంపొందించుకోవడానికి మరే పుస్తకాల అవసరం వుండదు. ప్రచార ఆర్భాటానికి ఆయన పూర్తిగా వ్యతిరేకి. ఆ కారణంగానే కమిట్‌మెంట్స్ సంస్థ ఏవైనా అవార్డులు, పురస్కారాలకోసం దరఖాస్తు చేయాలనుకోవడాన్ని కూడా ఆయన నిరుత్సాహపరిచేవారు. సాదాసీదాగా వుండడాన్నే ఆయన ఇష్టపడేవారు, తన జీవితమంతా దానినే ఆచరించి చూపారు. ఆ మహనీయుడు ఏ ఆశయంకోసమైతే తన జీవితమంతా అంకితం చేశారో అణగారిన వర్గాలు, అవకాశాలు రాని వర్గాల ప్రజల సాధికారత, నిరాడంబరత, వినయం అనే ఆ ఆశయాల సాధనకోసం మేము మా కృషిని కొనసాగిస్తాం. ■

ఆలోచించి మాట్లాడడం, అవగాహనతో ఆలోచించడం ఉత్తముల లక్షణం

# అసాధారణ మానవతావాది, పేదలకోసం అసమాన పోరాటశీలి !

*–కె. సంధ్యారాణి, ఐ ఏ ఎస్, విద్యాశాఖ కమిషనర్, ఆంధ్రప్రదేశ్*

**యు**గంధర్ గారు ఇక లేరు ! ఇలా అనుకోవడానికి మనస్సు ఒప్పుకోదు. అంటే ఆయనను ప్రతిరోజూ కలిసి మాట్లాడుతున్నామని కాదు. నిజానికి ఆయనను కలుసుకున్నది చాలా తక్కువే. అయితే, ఆయన చూపిన దారిలో నడిచేవారు, ఆయన తీర్చిదిద్దిన మనుషులు, ఆయన సహాయం పొందినవారు, ఆయన సంరక్షణలో ఎదిగినవారే కాకుండా ఆయనను వ్యతిరేకించిన వారు కూడా ఎందరో అధికారులు, ఎన్ జి ఓ ల ప్రతినిధులు, బలవంతులు, బలహీనులు, సామాన్యులు మొదలైన వారందరి గుండెలలో ఆయన చిరస్థాయిగా నిలిచిపోతారు. ఆయన మాటలు చేతలు మాలో ఎంతో గాఢమైన స్ఫూర్తిని నింపాయి. ఎంతటి అసాధారణ వ్యక్తిత్వం ఆయనది ! ఆయన మనసు ఎంత గొప్పది ! నిరుపేదలు, నిస్సహాయుల అభ్యున్నతి కోసం ఎంతటి అలుపెరుగని పోరాట యోధుడు ఆయన! ఇలాంటి మరో మనిషిని మనం చూడలేం.

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ గ్రామీణాభివృద్ధి శాఖలో వెలుగు ప్రాజెక్ట్‌కు చెందిన 'సెర్ప్' (గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ) లో డిప్యుటేషన్‌పై పనిచేసే సమయంలో యుగంధర్ గారితో కలసి పనిచేసే సువర్ణావకాశం నాకు కలిగింది. యగంధర్ గారు ఆ సంస్థకు వైస్ ఛైర్మన్ గా వుండేవారు. అప్పటి వరకు నేను యుగంధర్ గారి మహోన్నత వ్యక్తిత్వం గురించి నా ఐ ఏ ఎస్ సహాధ్యాయులు చెప్పగా విన్నదే. ముస్సోరీలోని లాల్ బహదూర్ శాస్త్రి ఐ ఏ ఎస్ శిక్షణ కేంద్రంలో ఆయన రాజీలేని కఠిన వ్యవహార శైలిని వ్యతిరేకిస్తూ కొందరు ఐ ఏ ఎస్ ప్రొబేషనర్లు ఆయనపై తిరుగుబాటు చేయడం, 'గుర్తేడు' సంఘటనకు పరిష్కారం కనుగొనడంలో ఆయన నిర్వహించిన నిర్ణయాత్మక పాత్ర గురించి ఆ సంఘటనలతో సంబంధం వున్న కొందరు సన్నిహిత మిత్రులు చెప్పింది వినడమే తప్ప ఆయన గురించి అప్పటికింకేమీ తెలియదు.

యుగంధర్‌గారి సమక్షంలో వున్నప్పుడు మేము కొంత బెరుగ్గా వుండేవాళ్ళం. యుగంధర్ గారి ఎదురుగా వున్నప్పుడు మనందరి హావభావాలు ఒక ప్రొబేషనర్ మాదిరిగానే వుంటాయి కదా , అని నేను సరదాగా అంటుండేదాన్ని. ఎంతో గౌరవం చూపుతూ, ఆయన మాట్లాడే



ఏమాటైనా ఎక్కడ జారిపోతుందోనని ఆతృతగా వింటూ, తెలివిగా సమాధానం చెప్పడానికో, వ్యాఖ్యానించడానికో అవకాశంకోసం ఎదురుచూస్తూ వుండేవాళ్ళం. ఆయనతో 'పనికిమాలిన దద్దమ్మ' (యూజ్‌లెస్ ఫెలో) అని అనిపించుకోవాలని ఎవరికి వుంటుంది? మా హావభావాలేవైనా ఆయన ప్రతి ఒక్కరు మాట్లాడేది ఎటువంటి ప్రతికూల భావన లేకుండా శ్రద్ధగా వినేవారు.

ఆ విషయం నాకిప్పటికీ గుర్తుంది. సెర్ప్‌లో అప్పుడు నేను ఒక వర్క్‌షాప్‌కు సమన్వయకర్తగా వ్యవహరిస్తున్నాను. నాకు కొంత అవమానకరమైన పరిస్థితి. పేదలను సామాజికంగా సంఘటితపరచడం, మహిళా స్వయం సహాయ సంఘాలకు సాధికారత కల్పించడం, వారికి సుస్థిర బ్యాంకు సేవలను అందుబాటులోకి తేవడం, వారి సామాజిక కార్యాచరణ మొదలైన అనేక అంశాలను గురించి, ఎదురయ్యే సవాళ్ళను గురించి రోజంతా ఎంతో ఆసక్తిదాయకమైన చర్చోపచర్చలు జరిగాయి. కార్యక్రమాన్ని ముగిస్తూ వందన సమర్పణలో భాగంగా నేను యుగంధర్ గారికి, వర్క్‌షాప్‌లో పాల్గొన్న వారందరికి కృతజ్ఞతలు చెప్పాను. కొద్దిసేపటికే యుగంధర్ గారిని గురించి వందన సమర్పణలో నేను మాట్లాడిన పొరపాటు మాట నాకు గ్రహింపునకు వచ్చింది. యుగంధర్ గారిది 'అనుకరణ సాధ్యం కాని' (ఇనిమిటబుల్ ) వ్యవహార దక్షత అని చెప్పాలనుకొని 'అనుకూలం కాని ధోరణి' (ఇనిమికల్) అని అన్నానని గుర్తుకు వచ్చింది. ఆ వర్క్ షాప్ లో తనకు 'అంతా తెలుసు' అని గర్వించే ఒక వ్యక్తిని ఆయన చెడామడా చీవాట్లుపెట్టిన విషయం నా మనసులో వుండిందేమో? అయినా అది కేవలం నాలిక తడబాటు తప్ప మరొకటి కాదు. తప్పు తెలుసుకున్న వెంటనే నేను యుగంధర్‌గారి దగ్గరకు వెళ్ళి

చిన్న విషయాలే చాలా అసాధారణంగా వుంటాయి, వివేకంతోనే వాటిని కనుగొనగలం




ఎంతగానో క్షమాపణ చెప్పాను. ఆయన ఆసలేమీ పట్టించుకోకుండా ఆప్యాయంగా నవ్వుతూ చేయి ఊపారు. అప్పటికిగాని నాకు ఊరట కలుగలేదు.

'కమిట్‌మెంట్స్'లో పనిచేటప్పుడు ఆయనతో సన్నిహితంగా పనిచేయడం కుదిరింది. దివ్యాంగులకోసం యుగంధర్‌గారు, మరో అసాధారణ మానవతా వాది, రాజీలేని తత్వం కలిగిన శ్రీ ఎస్ ఆర్ శంకరన్ గారితో కలసి ఆ ప్రజోపయోగ సంస్థను నెలకొల్పారు. తేజాస్ ఫౌండేషన్ ఏర్పాటులో ఆయన మాకు మార్గదర్శనం చేయడమే కాకుండా, ఆ సంస్థ కార్యాలయంగా వాడుకోవడానికి రెండేళ్ళపాటు తన ఇంటిని ఇచ్చారు. సంస్థ తరపున బ్యాంకి ఖాతా తెరవడానికి మేము బ్యాంకికి వెడితే, మమ్మలను బ్యాంకి అధికారులకు పరిచయంచేయడానికి ఆయన నడుచుకుంటూ బ్యాంకికి రావడం నన్ను ఎంతగానో కదిలించింది.

యుగంధర్ గారు చాలా అరుదైన అధికారి. మంచి అవగాహన వున్నవాడు. మేధావి. ఆచరణశీలి. క్రియాత్మక దార్శనికుడు. పనికిమాలిన వ్యవహార ధోరణి గిట్టనివాడు. మాట కటువు. చిత్తశుద్ధిలేని రాజకీయనాకులన్నా, అధికారులన్నా ఆయనకు చాలా తేలికభావం. వారిని లెక్కచేసేవాడు కాదు. పేదలపట్ల, ఎస్ సి, ఎస్ టి ల పట్ల, దివ్యాంగులపట్ల చాలా సానుభూతి చూపేవారు.ఎందరో యువ అధికారులను సమస్యలపట్ల స్పందించే విధంగా, దక్షతతో పదవిని నిర్వహించగలిగే విధంగా ఆయన తీర్చిదిద్దారు. జీవిత చరమదశలో ఆయన ప్రతికూలంగా మాట్లాడేవారిని బొత్తిగా లెక్కచేయకుండా చాలావరకు ఒంటరిగా మిగిలిపోయారు. అయినా ఆయన ఎంతటి అసాధారణ జీవితం గడిపారు! గ్రామీణ పేదరిక నిర్మూలన, పేదల తక్షణ అవసరాలు తీర్చే కార్యక్రమాలు, పనికిరాని భూముల సమీకృత అభివృద్ధి కార్యక్రమాలు, వ్యవసాయం, ప్రణాళికలు, పునర్నిర్మాణం వంటి అనేక కీలక రంగాలలో దేశ వ్యాప్తంగా పథకాలను ఎంతో ఉత్సాహంగా రూపొందించారు.

పేదలు, అవకాశాలు రాని వారి కోసం నిలబడే విధంగా, నిజాయతీతో గర్వంగా తలెత్తుకు తిరిగే విధంగా, కార్యదక్షతతో పనిచేసే విధంగా, విశాల దృక్పథంతో వ్యవహరించే విధంగా, గొప్పగా ఆలోచిస్తూనే మట్టిమనిషితో గాఢానుబంధం పెంచుకునే విధంగా యుగంధర్ గారి స్ఫూర్తి మమ్ములను ప్రభావితంచేస్తూనే వుంటుంది. సర్వభాగస్వామ్య దృక్పథం, వ్యక్తిగతమైన, వృత్తిపరమైన నిజాయితీ, మనదేశానికి ఎదురవుతున్న తీవ్రమైన సవాళ్ళను ఎదుర్కోడానికి రాజకీయ, అధికార వ్యవస్థలు జవాబుదారీతనంతో స్పందించే విధంగా ప్రయోజనాత్మక కృషి పట్ల కేంద్రీకరించవలసిన దృష్టి పక్కకు మళ్ళుతున్న నేటి ఈ ఆయోమయ దుస్థితిలో మార్గదర్శనం చేయగలిగే యుగంధర్‌గారి సాహచర్యాన్ని, ఆయన వివేకవంతమైన సలహాలను మనం కోల్పోతున్నాం. నిజంగా ఇది ఒక యుగ పరిసమాప్తి. అయినా, మనం మన స్వల్ప పరిధులలో మన కృషి ద్వారా ఒక సానుకూలమైన మార్పు తీసుకురాగలిగే విధంగా ఆయన మనలను ఆశీర్వదిస్తూ , స్ఫూర్తిని అందిస్తూనే వుంటారని, మన మార్గంలో వెలుగు నింపుతారని నేను నమ్ముతున్నాను.

ఆయన ఆత్మకు శాంతి కలుగుగాక !


■

నిజాన్ని అవగాహన చేసుకోలేని వారికి నిజం చెప్పడం తప్పే

# అత్యంత అరుదైన ఐ ఏ ఎస్ అధికారి, గొప్ప మానవతావాది !

*– ఆకునూరి మురళి, విశ్రాంత ఐ ఏ ఎస్ అధికారి*

**'యు**గంధర్ గారు అత్యంత అరుదైన ఐ ఏ ఎస్ అధికారి. గొప్ప మానవతావాది' అని తెలంగాణా ప్రభుత్వంలో ఆర్కైవ్స్ డైరెక్టర్ జనరల్ గా పనిచేసి పదవీ విరమణ చేసిన ఐ ఏ ఎస్ అధికారి శ్రీ ఆకునూరి మురళి నివాళి అర్పించారు. '1998 నుంచి ఆయనతో నాకు పరిచయం వుంది. అప్పుడు నేను యు ఎన్ డి పి ప్రాజెక్ట్ డైరెక్టర్‌గా మహబూబ్‌నగర్‌లో పనిచేస్తున్నాను. ఆయన 'యునెస్కాప్' (యు ఎన్ ఇ ఎస్ సి ఏ పి) లో పనిచేస్తుండేవారు. దివ్యాంగులకోసం ఒక ఎన్ జి ఓ ను ఏర్పాటుచేయాలని ఆయన తపన. ఎక్కడ ఏర్పాటుచేయాలని



పరిశీలనకై ఆయన మహబూబ్‌నగర్ వచ్చారు. ఆయన, నేను కర్నూలు, మహబూబ్ నగర్ తదితర ప్రాంతాలలో తిరిగాము. చివరకు మహబూబ్ నగర్ జిల్లాలో దివ్యాంగులు ఎక్కువగా వున్నారని కోస్గిలో 'కమిట్‌మెంట్స్' పేరుతో ఆయన మేనేజింగ్ ట్రస్టీగా స్వచ్ఛంద సంస్థ ఏర్పాటైంది. తిరుగులేని ఆయన అంకితభావం ఈ కమిట్‌మెంట్స్‌గా రూపుదిద్దుకుని ఎందరో దివ్యాంగులకు విశేష సేవలను అందిస్తున్నది. యుగంధర్ గారితోపాటు నాకూ కమిట్‌మెంట్స్‌తో విడదీయలేని ఆత్మీయానుబంధం ఏర్పడింది. 2004 లో యుగంధర్ గారు నన్ను ప్రభుత్వం నుంచి డిప్యుటేషన్‌పైన వచ్చి కమిట్‌మెంట్స్ లో ప్రాజెక్ట్ కోఆర్డినేటర్‌గా పనిచేయమని అడిగారు. నేను డిప్యుటేషన్ కోరుతూ వెంటనే సెలవుపెట్టి, కమిట్‌మెంట్స్‌లో వచ్చి చేరాను. మూడు నెలలు పనిచేశాను కూడా. అయితే, ప్రభుత్వం డిప్యుటేషన్ యివ్వలేదు. అందువల్ల కొనసాగలేకపోయాను. కాని యుగంధర్ గారిని తరచు కలుసుకుంటుండే వాడిని. యుగంధర్ గారు ఢిల్లీలో ప్రధానమంత్రి కార్యాలయంలో కీలక బాధ్యతలను



నిర్వహిస్తున్నప్పుడు కూడా అనేక సార్లు కలుసుకున్నాను. ఆయన ఎన్నో విషయాలు చర్చిస్తుండేవారు. ఎప్పుడూ పేదలను, నిస్సహాయులను గురించిన మాటలే. వారి పట్ల ప్రభుత్వాలు అనుసరించే తీరు ఆయనకు ఆశ్చర్యం కలిగించేది, ఆగ్రహం తెప్పించేది. అప్పట్లో 'సెర్ప్' (గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ) కు ముఖ్యమంత్రి ఛైర్మన్‌గా, శ్రీ యుగంధర్ గారు వైస్ ఛైర్మన్‌గా, శ్రీ కొప్పుల రాజు గారు సి ఇ ఓ గా వుండేవారు. అంకిత భావంతో పనిచేస్తున్న శ్రీ రాజుగారిని ఏవో రాజకీయ కారణాలతో ముఖ్యంంత్రి సెర్ప్‌నుంచి బదిలీ చేశారు. ఆ అనుచితమైన ధోరణిని సహించలేని యుగంధర్ గారు వైస్ ఛైర్మన్ పదవికి వెంటనే రాజీనామా చేశారు. నమ్మిన సిద్ధాంతం పట్ల ఆయన అంకితభావం అలాంటిది. ప్రధాని కార్యాలయం, ఐక్యరాజ్య సమితి వంటి ఎన్నో ఉన్నతస్థాయి పదవులు ఆయనను వరించినా అధికార దర్పం అనే మాటకాని, పదవీ వ్యామోహం కాని ఎంతమాత్రం ఎరుగని మహనీయుడు ఆయన. ఎంతో సాదాసీదాగా వుండడానికే ఆయన ఇష్టపడేవారు. నిరాడంబరతకు ఆయన మారుపేరు. అప్పట్లో మహబూబ్ నగర్‌లో సరైన వసతులతో కూడిన హోటల్స్ కాని, లాడ్జిలు కాని వుండేవి కావు. ఆయనకు అసౌకర్యమవుతుందేమోనని మేము ఆలోచిస్తుంటే ఆయన నాకెక్కడైనా ఫరవాలేదు, చిన్న హోటలైనా చాలు , కరెంట్ వున్నా లేకున్నా ఇబ్బందిలేదు, ఎత్తుగా కూర్చునే మరుగుదొడ్డి (వెస్టన్ కమోడ్) సౌకర్యం వుంటే చాలు' అనేవారు. ఐ ఏ ఎస్ అధికారులకు, సమాజానికి ఆయన గొప్ప స్ఫూర్తి ప్రదాత'. ■

ఆత్మీయత పంచుకోవడానికి ఒకతోడు, చేయడానికి ఒకపని, రేపటిమీద ఆశ వుంటే చాలు




*ఏపిమాస్ పదవ వార్షికోత్సవం సందర్భంలో ....*

## నివాళి ... సంపాదకీయం (3 వ పేజీ తరువాయి)

పాత్ర. ఆయన ప్రోద్బలంతోనే నేను 'కమిట్‌మెంట్స్'లో ట్రస్టీనయ్యాను. కమిట్‌మెంట్స్ పూర్తి బాధ్యతలు చేపట్టమని కూడా ఆయన నన్ను కోరారు. కాని ఏపిమాస్ లో గురుతరమైన బాధ్యతలు నిర్వహిస్తున్న నేను వారి ఆహ్వానాన్ని అంగీకరించలేక పోయాను. కమిట్‌మెంట్స్‌కు ఏపిమాస్ వివిధ రకాలుగా



తోడ్పాటు అందిస్తూ వస్తున్నది. దివ్యాంగుల ఎస్ హెచ్ జిల పై అధ్యయనం చేయడానికి, వాటి స్థాయిని నిర్ణయించడానికి అనువైన రేటింగ్ టూల్‌ను ఏపిమాస్ రూపొందించింది. ప్రస్తుతం హైదరాబాదులో ఏపిమాస్ కార్యాలయ భవనంలోనే కమిట్‌మెంట్స్ తన కార్యాలయాన్ని నిర్వహిస్తున్నది.

ఆయన ఇటీవల కొంతకాలంగా అనారోగ్యంతో ఇంటికే పరిమితమైనా నేను మూడునాలుగు నెలలకొకసారి ఆయనను కలుసుకుని పలకరిస్తుండేవాడిని. కొద్ది సేపు ఆయనతో గడిపినా మానసికంగా ఎంతో ఉత్తేజంగా అనిపించేది. ఆయన గొప్ప పుస్తక ప్రియుడు. అభివృద్ధి రంగానికి సంబంధించిన అనేక పుస్తకాలు ఎప్పుడూ చదువుతుండేవారు. ఏపిమాస్ ప్రచురించే 'మహిళా సాధికారత' పత్రికను కూడా ఆయన విడవకుండా చదివేవారు. ఎప్పుడైనా ఏ కారణం వల్లనైనా ఆయనకు ఆ పత్రిక అందకపోతే 'నాకు ఈ నెల మహిళా సాధికారత పత్రిక రాలేదయ్యా' అని అడిగేవారు.

ఎన్నెన్నో వెలుగులు పంచిన ఒక ఉజ్వల జ్యోతి కనుమరుగైంది. ఆ వెలుగును ఆయన చేర్చాలనుకున్న అట్టడుగు జీవికి, అసహాయులకు చేర్చడంలో మనవంతు పాత్రను మరింత అంకిత భావంతో నిర్వహిద్దాం. అదే ఆయనకు మనం ఇవ్వవలసిన ఘన నివాళి.

■

ఇతరులకోసం ఉబికివచ్చే కన్నీరు బేలతనానికి చిహ్నం కాదు , సహృదయతకు సంకేతం

# ఆజీవ మహిళా ఎఫ్ పి సి రెండవ వార్షిక మహాసభ !

**ఆ**జీవ మహిళా రైతు ఉత్పత్తిదారుల కంపెనీ 2వ సర్వసభ్య సమావేశం యాదగిరిగుట్ట రెడ్డి సంక్షేమ భవనంలో సెప్టెంబర్ 6వ తేదీన జరిగింది. కంపెనీ అధ్యక్షులు శ్రీమతి గుజ్జక ఎల్లుబాయి అధ్యక్షతన జరిగినది. ఆజీవ కంపెనీ సి.ఇ.ఓ శ్రీ జి.శ్రీనివాస్ పాలకవర్గ సభ్యులను వేదిక పైకి ఆహ్వానించి, స్వాగతోపన్యాసం చేశారు. కంపెనీ కార్యక్రమాల నివేదికను చదివి వినిపించారు. ముందుగా శ్రీమతి ఎల్లుబాయి మాట్లాడుతూ మహిళా రైతులను రైతులుగా గుర్తించాలని, మార్కెట్‌లో రైతులు దళారుల చేతిలో మోసపోకుండా తమకు కావల్సిన వ్యవసాయ పెట్టుబడులు, విత్తనాలు, ఎరువులను ఉమ్మడిగా సమకూర్చుకొని అభివృద్ధి చెందాలని సూచించారు. బోర్డు సభ్యులు విజయ , కె.స్వరూప వార్షిక నివేదికను చదివి వినిపించారు. కంపెనీ ఆదాయ, వ్యయ పట్టికను చదివి వివరించగా సభ్యులు దానిని ఆమోదించారు.

యాదాద్రి భువనగిరి జిల్లా వ్యవసాయాధికారిణి అనూరాధ గా ముఖ్య అతిధిగా పాల్గొన్నారు. మహిళాభివృద్ధి సొసైటీ (మాస్) నుంచి శ్రీమతి కళామణి గారు, భవాని గారు, కిశోర్ గారు , ఇంకా ఉద్యానశాఖ నుండి సౌమ్య గారు,



యాదగిరిగుట్ట ఏ.ఒ. శ్రీ రాజేశ్, యాదగిరిగుట్ట మండల జడ్.పి.టి.సి సభ్యురాలు తోటకూరి అనూరాధ గారు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

డి.డి.ఎస్ సంస్థ నుండి క్రిష్ణవేణి గారిని పీస్ సంస్థ డైరక్టర్ ఆహ్వానించగా క్రిష్ణవేణిగారు మన ఆహారంలో చిరుధాన్యాల ప్రాధాన్యతను వివరించారు. చిరుధాన్యాలను ప్రోత్సహించుటకు చిరుధాన్యాల చెల్లెండ్ల నెట్‌వర్క్‌ను వివరించారు. చిరుధాన్యాలకు ఎక్కువ పెట్టుబడి అవసరం లేదు. తేలిక నేలలలో , తేలికపాటి వర్షాలకు పంట పండుతుందని చిరుధాన్యాలు ఆహారభద్రతతో పాటు పోషకాహార భద్రత చేకూర్చుతాయని ఆమె వివరించారు. డి.ఎ.ఓ. అనూరాధ గారు మాట్లాడుతూ ఆజీవ కంపెనీకి పూర్తి సహకారం అందిస్తామని హామీ ఇచ్చారు. మహిళలు అన్ని రంగాలలో ముందుకు రావాలని మహిళలు పారిశ్రామికవేత్తలుగా ఎదగాలి అని సూచించారు.




కళామణి గారు మాట్లాడుతూ ఇంతమంది మహిళలను చూస్తుంటే తనకు ఎంతో ఆనందంగా ఉందని, మహిళలు మగవారితో సమానంగా అన్ని రంగాలలో రాణించాలని, తమ వ్యక్తిత్వాన్ని పెంపొందించుకోవాలని, మహిళల ఆత్మవిశ్వాసం మహిళా శక్తి పురోగతిని సూచిస్తుందని తమ సంతోషాన్ని వ్యక్తపరిచారు.

భవాని గారు ఆజీవ ప్రాజెక్టు లక్ష్యాలను వివరించారు. డిసెంబర్ నాటికి 500 మంది పూర్తిగా తమ తమ వాటా ధనం చెల్లించి వ్యాపార పరిధిని పెంచుకోవాలని ఆమె సూచించినారు. అజీవ ప్రాజెక్టు

కోఆర్డినేటర్ కిషోర్ గారు మాట్లాడుతూ అజీవ కంపెనీ ఇంకా విస్తృత స్థాయిలో ఆలోచించి వ్యాపారపరిధిని పెంచుకోవాలని సూచించినారు.

ఎ.ఇ. రాజీవ్ గారు మాట్లాడుతూ రైతులు విస్తృత స్థాయిలో సేంద్రియ వ్యవసాయాన్ని అనుసరించి, చిరుధాన్యాల ఉత్పత్తిని పెంచాలని సూచించారు. ■

నీకు భయమనిపించే పని రోజుకు ఒకటి చెయ్యి ; ఆ పైన భయమే నీకు భయపడుతుంది

# ధీశాలి మహిళా ఎఫ్‌పిసి ద్వితీయ వార్షిక మహాసభ!

– డి. విజయలక్ష్మి



'ధీశాలి రైతు మహిళా ఉత్పత్తిదారుల కంపెనీ ' (ధీశాలి మహిళా ఎఫ్ పి సి) ద్వితీయ వార్షిక మహాసభ జి ఎం ఎం, ఏ ఇ ఐ ఎన్, మాస్ (మహిళాభివృద్ధి సొసైటీ) సంస్థల సహకారంతో యాదాద్రి–భోనగిరి జిల్లా , బొమ్మలరామారం మండలం, చీకటిమామిడి గ్రామంలోని 'శ్రీ బాలాజీ ఫంక్షన్ హాల్ 'లో 2019 సెప్టెంబర్ 20 వ తేదీన ఉత్సాహంగా జరిగింది. మండలంలోని 6 గ్రామాల నుండి 194 మహిళా రైతులు ఈ మహాసభలో ఎంతో ఉత్సాహంతో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో సంబంధిత శాఖల ప్రభుత్వ అధికారులు, మహిళా అభివృద్ధి సొసైటీ ప్రతినిధులు కూడా పాల్గొని మహాసభను విజయవంతం చేశారు.

**ధీశాలి కంపెనీ ఉద్దేశాలు**

మహిళా రైతులకు గుర్తింపు, గౌరవం, విలువ, సాంకేతిక విజ్ఞానంతో పాటు సాధికారత కల్పించాలన్న ఆశయంతో 'గ్రామీణ మహిళా మండలి ' మాస్ సహకారంతో రైతులను సంఘటిత పరిచి 'ధీశాలి రైతు మహిళా ఉత్పత్తిదారుల సంస్థ' (ఎఫ్ పి ఓ) ను ఏర్పాటు చెయ్యడం జరిగింది. ఎఫ్ పి ఓ అనేది శాశ్వతంగా కొనసాగే స్వయం నిర్ణయాధికారం గల ప్రజాస్వామ్య సంస్థ. ప్రతి గ్రామంలో గ్రామ రైతు ఉత్పత్తిదారుల సంఘాన్ని ఏర్పాటు చేసి, రైతు వేదికలను ఏర్పాటు చేసి, సన్న, చిన్నకారు రైతులు పండించే పంటల ఉత్పత్తికి కావలసిన నాణ్యమైన విత్తనాలు, ఎరువులు, వ్యవసాయ యంత్రాలు అందుబాటులోకి తెచ్చి , రైతు సంక్షేమం కోసం ప్రభుత్వం చేపట్టే వివిధ రకాల పథకాలను రైతులకు అందేలా చూసి, రైతులు సమిష్టిగా, వ్యాపార దృక్పథంతో, మార్కెటింగ్ పట్ల సరైన అవగాహనతో గిట్టుబాటు ధరలను పొందేలా చూడడం, వారి హక్కులను పూర్తిగా సాధించుకునేలా చేయడం ధీశాలి రైతు ఉత్పత్తిదారుల సంస్థ ఆశయం,

**భవిష్యత్ ప్రణాళికలు**

1. ఎఫ్ పి సి కి శాశ్వత భవనం ఏర్పాటుచేసుకోవడం
2. మినీ–మార్కెట్ యార్డ్ స్థాపన
3. పూర్తి స్థాయిలో వ్యాపార నిర్వహణ
4. మరింతమంది రైతులను వాటాదారులుగా చేర్చడం
5. సంస్థకు ఆర్థిక వనరులు సమకూర్చడం
6. కొత్త గ్రామాలకు విస్తరించడం
7. కంప్యూటర్‌ను , సాఫ్ట్‌వేర్‌ను సమకూర్చుకోవడం

■

చాలా సందర్భాలలో భరించలేకపోవడం బరువు వల్ల కాదు , సరిగా పట్టుకోక పోవడంవల్ల

# జై కిసాన్ ఎఫ్ పి ఓ చేపట్టిన కార్యక్రమాలు !

– శ్రీనివాస్ , రాజ్‌కుమార్

'జై కిసాన్ వ్యవసాయ ఉత్పత్తి దారుల పరస్పర సహకార సంఘం' (ఎఫ్ పి ఓ) సభ్య రైతుల సంక్షేమం కోసం గత నెలలో వివిధ కార్యక్రమాలను నిర్వహించింది. వాటిలో ముఖ్యమైన కొన్ని కార్యక్రమాలను గురించి తెలుసుకుందాం.



1. జై కిసాన్ ఎఫ్ పి ఓ కస్టమర్ హైరింగ్ సెంటర్ (సి హెచ్ సి) ద్వారా 15మంది రైతులకు తక్కువ ధరలకు వ్యవసాయ పనిముట్లు అందించింది.
2. ఆదర్శ రైతులను గుర్తించి ప్రదర్శన క్షేత్రాలను (డెమో ప్లాట్స్) నిర్వహించి , వరి , పత్తి పంటలపై పొలం బడి కార్యక్రమాలను ఏర్పాటు చేసింది. ఇందులో భాగంగా మట్టి నమూనా పరీక్షల నిర్వహణ, మొలక శాతాన్ని గుర్తించడం, ఆకుమడి తయారు చేసే విధానాన్ని వివరించి, దోమపోటు వ్యాప్తి చెందకుండా పొలం మధ్యలో మూడు మీటర్లకు ఖాళీ స్థలాలను ఏర్పాటు చేయడం జరిగింది.
3. ప్రదర్శన క్షేత్రాలలోను, రైతుల పొలాలలోను వరి , పత్తి పంటలపై పొలం బడి కార్యక్రమాల ద్వారా లింగాకర్షణ బుట్టలు , పసుపు రంగు జిగురు అట్టల ఏర్పాటు వంటి సస్యరక్షణ పద్ధతులపై రైతులకు సరైన అవగాహన కలిగించింది.
4. రైతు సంఘాలపై పల్వనూర్, చందాపూర్, నస్తీపూర్, కాసల గ్రామాలలోని స్వయంసహాయ (డ్వాక్రా) మహిళా సంఘాల రైతులతో సమావేశాలు ఏర్పాటు చేసి రైతు సంఘాల సభ్యత్వం గూర్చి , సంఘం ఉపయోగాలను గూర్చి అవగాహనా కార్యక్రమాలను నిర్వహించింది.
5. రైతు సమావేశాలలో సంఘం ప్రాధాన్యత గురించి, అభివృద్ధి చెందిన సంఘాల ప్రగతిని గురించి సాధారణ వివరణతోపాటు చిత్రాల రూపంలో కూడా వివరించడం జరిగింది.
6. పచ్చ పురుగు నివారణకు అనుసరించవలసిన సేంద్రియ (ఆర్గానిక్ ) విధానాన్ని గురించి రైతులకు ప్రదర్శనాత్మకంగా శిక్షణ ఇవ్వటం జరిగింది

**పచ్చ పురుగు నివారణ : కావలిసిన పదార్థాలు**

1. పచ్చి మిరపకాయలు 3 కిలోలు
2. ఐదువందల గ్రాముల వెల్లుల్లిపాయలు (ఎల్లిపాయలు)
3. 275 గ్రాములుకిరోసిన్
4. 75 గ్రాములు బట్టల ఉతికే సబ్బు

**తయారు చేసే విధానం :**

1) 10 లీటర్లు నీటిని తీసుకొని పచ్చి మిరపకాయలను నూరి నూలు గుడ్డలో కట్టి ఆ నీటిలో రాత్రి పూట నాననివ్వాలి.



2) ఎల్లిపాయలను దంచి కిరోసిన్‌లో రాత్రిపూట నాననివ్వాలి.
3) బట్టల సబ్బును నీటిలో రాత్రిపూట నాననివ్వాలి.




ఈ మూడు మిశ్రమాలను వడపోసి మూడింటిని కలపాలి. నాలుగు గంటల తర్వాత 100 లీటర్ల నీటిలో ఈ మిశ్రమాన్ని కలపి పిచికారి చేయాలి.

పచ్చ పురుగు నివారణకు ఈ మిశ్రమం చాలా బాగా పని చేస్తుంది. ఏ పంట కైనా దీనిని వాడవచ్చు.

జీవామృతం చేసే విధానం గూర్చి రైతులకు ప్రదర్శన పూర్వకంగా శిక్షణ ఇవ్వటం జరిగింది.

**కస్టమర్ హైరింగ్ సెంటర్**

జై కిసాన్ వ్యవసాయ ఉత్పత్తిదారుల సంఘంలో సభ్యత్వం తీసుకున్న వారికి తక్కువ అద్దెకు వ్యవసాయ పనిముట్లను ఇస్తాము. దీనివల్ల రైతులకు పెట్టుబడిలో కొంత ఖర్చు తగ్గుతుంది. జై కిసాన్ వ్యవసాయ ఉత్పత్తిదారుల సంఘం లాభాపేక్ష లేకుండా 155 మంది రైతులకు తక్కువ ధరలకు కస్టమర్ హైరింగ్ సెంటర్ ద్వారా సేవలను అందిస్తున్నది.

ఈ నెలలో (ఆగస్టు) జై కిసాన్ ఎఫ్ పి ఓ 1,50000 రూపాయల విలువైన పనులు చేసి 75000 రూపాయలు లాభం పొందింది.

వ్యవసాయ పనిముట్లను రైతు సక్రమంగా ఉపయోగించు కోవటం వల్ల 5 ఎకరాల రైతుకు సంవత్సరానికి 18000 రూపాయలు మిగులుతుంది. పై విధంగా జై కిసాన్ ఎఫ్ పి ఓ రైతులకు వివిధ రకాలుగాసేవలను అందిస్తున్నది.



**సి హెచ్ సి ద్వారా 5 ఎకరాలు ఉన్న సభ్య రైతుకు మిగిలే ఖర్చు**

| వివరాలు | గంటకు సంఘం నిర్ణయించిన ధరలు | సంఘ సభ్యుడు | సంఘంలో లేని సభ్యుడు | ఖరీఫ్ పంటకు రైతు ఆదాయం మిగులు |
|---|---|---|---|---|
| దుక్కి | 600 | 3000 | 3750 | 750 |
| పెద్ద నాగళ్ళు | 600 | 3000 | 4000 | 1000 |
| బెలోర్ | 20 పర్ బెండ | 4000 | 6000 | 2000 |
| దమ్ము | 1100 | 5500 | 6000 | 500 |
| రోతోవేటర్ | 800 | 4000 | 7000 | 3000 |
| డోజార్ | 600 | 3000 | 4000 | 1000 |
| | మొత్తం | 22500 | 30750 | 8250 |

■

మంచి ముగిసిందని కుమిలిపోవడం ఎందుకు , ఆ మంచి జరిగిందని సంతసించాలి కాని

# పండుగను తలపించిన జి.ఐ.జడ్ బృంద పర్యటన!

– ఎన్. ప్రహ్లాదయ్య



ఇటలీ, జర్మనీ దేశాలతో పాటు మనదేశంలోని ఆంధ్రప్రదేశ్ , కర్ణాటక, మహారాష్ట్ర, హిమాచల్ ప్రదేశ్, ఢిల్లీ, పుదుచ్చేరి రాష్ట్రాలకనుంచి వచ్చిన 22 మంది జి.ఐ.జడ్ ప్రతినిధుల క్షేత్ర పర్యటన చిత్తూరు జిల్లా రామసముద్రం మండలంలో పండుగ వాతావరణాన్ని తలపించింది. ఈ నెల 2019 సెప్టెంబర్ 3 వతేదీన జి.ఐ.జడ్ క్షేత్ర పర్యటన బృందం రామసముద్రంలోని వ్యవసాయ ఉత్పత్తిదారుల సమాఖ్యను సందర్శించింది. మండలంలో 'మహిళా అభివృద్ధి సొసైటి' (మాస్) ద్వారా అమలులో వున్న వివిధ రకాల టొమాటో విలువ పెంపు కార్యక్రమాలు, కూరగాయల మార్కెటింగ్, రైతు సమృద్ధి కేంద్రం మొదలైన వాటిని సందర్శించి కార్యక్రమాల అమలు తీరును మెచ్చుకున్నారు. రామసముద్రం వ్యవసాయ ఉత్పత్తిదారుల సంస్థ చేపట్టిన కార్యక్రమాలు రైతులకు ఎంతో ఉపయోగకరంగా వున్నాయని జి.ఐ.జడ్ – జర్మనీ ప్రతినిధి జార్జ్ బొకాలే అన్నారు.

మాస్ ద్వారా ఇప్పటివరకు చేపట్టిన కార్యక్రమాల గురించి సంస్థ ప్రాజెక్టు డైరెక్టరు శ్రీ పాపిరెడ్డి , ఎఫ్.పి.ఓ అధ్యక్షులు శ్రీ చెంగారెడ్డి ప్రతినిధుల బృందానికి వివరించారు. తాము పండించే వివిధ రకాల పంట యాజమాన్య పద్ధతులపై అవగాహన పెంపొందించుకొని, భూసార పరీక్ష చేయించి, తగు మోతాదులో ఎరువులు, క్రిమిసంహారక మందులు వాడుతూ, పంట వ్యయాలను తగ్గించుకునే విధంగా రైతులను చైతన్య పరచడమే మాస్ ఆశయమని శ్రీ పాపిరెడ్డి పేర్కొన్నారు.

రామసముద్రం ఎఫ్.పి.ఓలో ఇప్పటివరకు 2126 మంది టొమాటో పండించే రైతులు సభ్యులుగా వున్నారు. ఉద్యానశాఖ నుండి 9.75 లక్షల సబ్సిడీతో కూరగాయల రవాణా వాహనాన్ని ఈ ఎఫ్ పి ఓ కొనుగోలు చేసింది. ఈక్విటీ గ్రాంట్ ద్వారా మరో 5.0 లక్షలు ఈ ఎఫ్ పి ఓ కు మంజూరు అయ్యాయి. రైతు సమృద్ధి కేంద్రాన్ని ఏర్పాటు చేసి రైతులకు కావలసిన ఎరువులు, విత్తనాలు, యంత్ర పరికరాలు మొదలైన వివిధ రకాల సేవలను ఎఫ్ పి ఓ వారికి అందుబాటులోకి తెచ్చింది. సభ్య రైతులు తాము పండించే కూరగాయలకు తగిన గిట్టుబాటు ధరలు పొందేలా చూడడం కోసం బెంగళూరులోని 'బిగ్ బాస్కెట్ ','మెట్రో' మొదలగు మార్కెట్ లతో ఒప్పందం చేసుకొని కూరగాయల మార్కెటింగ్ కార్యక్రమాలు చేపడుతున్నది. ■

ఒకే ఒక జీవితం, కాని సజావుగా జీవిస్తే ఒక్కసారే చాలు




జి ఐ జడ్ బృందం రామసముద్రం ఎఫ్.పి.ఓ కార్యవర్గ సభ్యులతో చర్చించి ఎఫ్ పి ఓ ఆధ్వర్యంలో మండలంలో జరిగిన ఇలాంటి వివిధ కార్యక్రమాలను గురించి తెలుసుకున్నారు.

అనంతరం మాలెనత్తం గ్రామాన్ని సందర్శించి అక్కడ రైతులు శ్రీ రమేశ్, శ్రీ రామచంద్ర , శ్రీ రెడ్డి శేఖర్ చేపట్టిన సమిష్టి కూరగాయల మార్కెటింగ్ కార్యక్రమాలను ప్రత్యక్షంగా పరిశీలించి రైతులతో మాట్లాడి మార్కెటింగ్ కార్యక్రమం వలన కలిగే ప్రయోజనాలు అడిగి తెలుసుకున్నారు.

**సమిష్టి మార్కెటింగ్ ప్రయోజనాలు**

- రైతులు పండించిన పంటలకు కచ్చితమైన తూకం వుంటుంది.
- దళారులు లేకుండా రైతుకు మేలు కలుగుతుంది.
- మండి వ్యాపారులు తీసుకునే కమిషన్ రైతులకు మిగులుతుంది.
- రైతు సంస్థ చేపట్టిన స్వంత వ్యాపారం ద్వారా రైతులకు, సంస్థకు మేలు జరుగుతుంది.

తరువాత బృంద సభ్యులు మినీకి గ్రామంలోని శ్రీమతి కళావతి , శ్రీ వాసుదేవరెడ్డి నిర్వహిస్తున్న 'శ్రీ వేంకటేశ్వర ఆదర్శ కూరగాయల నర్సరీ' ని సందర్శించి అక్కడ రైతుల కోసం చేపట్టిన ఉత్తమ ఆచరణ పద్ధతులను పరిశీలించారు. ఈ ఉత్తమ ఆచరణ పద్ధతుల వలన వ్యాపారం బాగా పెరిగి వారు అదనంగా మరో రెండు నర్సరీలను ప్రారంభించారు. ప్రస్తుతం నర్సరీలో ఒకేసారి 9 లక్షల మొక్కలను పెంచే సామర్థ్యం వుందని శ్రీమతి కళావతి తెలిపారు. మాస్ నేతృత్వంలో అమలు జరుగుతున్న కార్యక్రమాలు చాలా సంతృప్తి కలిగించాయని జర్మనీ ప్రతినిధి జార్జ్ బొకాలే ప్రశంసించి, భవిష్యత్‌లో రైతులకు ఉపయోగపడే మరిన్ని కార్యక్రమాలు చేపట్టాలని కోరారు. నర్సరీలో చేపట్టిన ఉత్తమ ఆచరణ పద్దతులు:

- దోమల నుండి నారును కాపాడుటకు నారు చుట్టూ ఉత్తమ నాణ్యతగల వల ఏర్పాటు
- బయటి దోమలు లోపలకు పోకుండా రెండు తలుపుల విధానం
- నారు మొదళ్ళను పటిష్టపరిచే ఉత్తమ నీటి యాజమాన్యం
- లోపలకు వచ్చే దోమలను లోపలనే సంహరించుటకు వివిధ రకాల లింగాకర్షక బుట్టల ఏర్పాటు
- మంచి నాణ్యత గల కొకోపిట్ వాడడం
- ఉత్తమ నాణ్యతగల కంపెనీల నుండి విత్తనాలు కొనడం
- నాణ్యతగల పెద్ద రంధ్రాలు గల ప్రొట్రే లను వాడడం. వీటి వలన నారు కాండం లావుగా పెరుగుతుంది.

ఈ కార్యక్రమంలో ఇంకా జి.ఐ.జడ్. ఇండియా తరపున శ్రీ ధనుంజయ్, ఉర్లగడ్డల (ఆలు లేదా బంగాళాదుంపల) పరిశోధనా కేంద్రం నుండి శ్రీ రవీంద్రరెడ్డి, బెంగళూర్ ఏ.ఎఫ్.సి. నుండి శ్రీ రంగనాధ బాబు, మహారాష్ట్ర నుండి శ్రీమతి సంగీతా పాటిల్, కర్ణాటక ఉద్యాన విశ్వవిద్యాలయం నుండి శ్రీమతి మీనాక్షి, మాస్ నుండి ప్రాజెక్టు మేనేజర్లు శ్రీ జగన్‌మోహన్‌రెడ్డి, డా.ప్రహల్లాద, వాసుదేవరెడ్డి, సాంకేతిక సిబ్బంది శ్రీ నవీన్ , శ్రీ కృపానంద్, సిఈఓ భరత్, కోఆర్డినేటర్ శ్రీమతి పూర్ణిమ, రైతు సమృద్ధి కేంద్రం నుండి శ్రీమతి అనిత, రైతు సమాఖ్య కార్య నిర్వాహక కమిటీ సభ్యులు , రైతు మిత్రలు పాల్గొన్నారు. ■

కేవలం కలలు కంటూ ఆచరణను విస్మరిస్తే , జీవితం శూన్యం

# పౌష్టికాహారం - ఇంటింటి వ్యవహారం !

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ 'మహిళాభివృద్ధి , శిశు సంక్షేమ శాఖ' పౌష్టికాహార మాసోత్సవాల సందర్భంగా మహిళలకు, కిశోర బాలికలకు తగిన అవగాహన కల్పించడంకోసం కొన్ని ప్రచార పోస్టర్లను విడుదలచేసింది. ఆ పోస్టర్ల వివరాలు 'మహిళా సాధికారత' పాఠకులకోసం ....

- గర్భిణి కనీసం 4 సార్లు ఆరోగ్య పరీక్షలు చేయించుకోవాలి
- కిశోర బాలికలు, గర్భిణులు ఐరన్ మాత్రలు తప్పక వేసుకోవాలి.
- శిశువు పుట్టిన వెంటనే తల్లిపాలు పట్టాలి. 6 నెలల వరకు కేవలం తల్లిపాలు మాత్రమే పట్టాలి.
- బిడ్డకు 7వ నెల నుండి 2 సంవత్సరాల వరకు అనుబంధ పోషకాహారం పెట్టాలి. తల్లిపాలు కూడా ఇవ్వాలి.
- ప్రతిరోజూ తినే ఆహారంలో కనీసం 4 రకాల పోషకాలు వుండేలా చూసుకోవాలి.
- ఐరన్ , విటమిన్ 'సి'తో కూడిన ఆహారం (ఆకుకూరలు, పండ్లు) తినాలి.
- 6 నెలలకు ఒకసారి నులిపురుగుల నివారణ మాత్ర (ఆల్బెండజోల్) వేసుకోవాలి.

*మీ బిడ్డను విరేచనాల నుంచి కాపాడటం మీ చేతుల్లోనే ఉంది!*

**3 విషయాలు గుర్తుంచుకోండి**

- విరేచనాలు తగ్గేవరకు ఓ.ఆర్.ఎస్. ద్రావకం పట్టాలి.
- 2 వారాలు జింక్ మాత్రలు ఇవ్వాలి.
- ఇంట్లో లభించే ద్రవ పదార్థాలు - గంజి, పప్పునరు, మజ్జిగ, కొబ్బరినీరు ఇవ్వాలి.
- విరేచనాలున్నా సరే కేవలం తల్లిపాలే త్రాగించాలి.
- 6 నెలలలోపు బిడ్డకు వేరే ఇతర పానీయాలు ఇవ్వవద్దు.

విరేచనాలు అవుతున్నప్పుడు మీ బిడ్డకు చికిత్సనందించకపోతే ప్రాణాంతకం కావచ్చు.

**బిడ్డ పుట్టిన గంటలోపే తల్లిపాలు పట్టాలి!**

- ముర్రుపాలు బిడ్డకు సంజీవని
- తల్లిపాల వల్ల బిడ్డకు రోగనిరోధక శక్తి పెరుగుతుంది
- తల్లిపాలు తప్ప ఇంకేమీ ఇవ్వకూడదు

**ఏ టీకా ఎప్పుడు వెయ్యాలో గుర్తుంచుకోండి!**

- పుట్టినప్పుడు
  1వ సారి
  బి.సి.జి.
  ఓ.పి.వి-0
  హెపటైటిస్-బి
- ఒకటిన్నర నెలలో
  2వ సారి
  ఓ.పి.వి-1
  పెంటావాలెంట్ - 1
  రోటావైరస్ - 1
  పి.సి.ఏ-1
  ఐ.పి.వి-1
- రెండున్నర నెలలో
  3వ సారి
  ఓ.పి.వి-2
  పెంటావాలెంట్ - 2
  రోటావైరస్ - 2
- మూడున్నర నెలలో
  4వ సారి: ఓ.పి.వి-3
  పెంటావాలెంట్-3
  రోటావైరస్-3
  పి.సి.వి-2
  ఐ.పి.వి-2
- 9 నెలలు
  5వ సారి
  మీజిల్స్ రుబెల్లా-1
  జపనీస్ ఎన్సెఫలిటిస్-1
  విటమిన్-ఎ-1
  పి.సి.వి.బూస్టర్
- ఒకటిన్నర సంవత్సరం
  6వ సారి
  డి.ఏ.టి. బూస్టర్
  విటమిన్-ఎ-2
  మీజిల్స్ రుబెల్లా-2
  జపనీస్ ఎన్సెఫలిటిస్-2
  ఓ.ఏ.వి.బూస్టర్

ప్రాణాంతక వ్యాధుల నుంచి ఈ టీకాలు మన పిల్లలను రక్షిస్తాయి. మరిన్ని వివరాలకు ఆరోగ్య కార్యకర్తను సంప్రదించండి ■

అబద్ధం కలిగించే ఆనందం కంటె నిజం వల్ల కలిగే గాయమైనా మేలే

# మూడు నెలలలో కుట్టు పనిలో నైపుణ్యం !

ప్రస్తుత పరిస్థితుల్లో కేవలం ఒక్కరి సంపాదన ఇంటికి సరిపోవడం లేదు. కుటుంబ పోషణ,రోజు రోజుకు పెరుగుతున్న ధరలు, పిల్లల చదువులు భారంగా మారుతున్నాయి. ఈ



కారణంగా మగవారి సంపాదనతో పాటు తాము కూడా ఎంతో కొంత సంపాదించి ఇంటికి అండగా నిలవాలని మహిళలు కుట్టుపనిని (టైలరింగ్‌ను) ఆదాయ మార్గంగా చేసుకుంటున్నారు. నేడు ఒక జాకట్టు (బ్లౌస్) కుట్టించు కోవాలంటే 150 రూపాయలు చెల్లించవలసి వస్తున్నది. ఇంటిల్లిపాదికి బట్టలు కుట్టించుకోడానికి వేల రూపాయలు కుట్టు కూలీకి ఖర్చు చేయాల్సి వస్తుంది. కుట్టు నేర్చుకుంటే తమ ఇంటిపని, వంట పనులతోపాటు ఉపాధి సైతం పొందవచ్చునని మహిళలు కుట్టు శిక్షణపై ఆసక్తి ని




పెంచుకుంటున్నారు. ఇది నెల్లూరు జిల్లా శ్రీ రామాపురం గ్రామ పరిస్థితి.

మరొక గ్రామం పెయ్యలపాలెం లో మహిళలు రోజువారీ కూలీపనులకు వెళ్ళితే గాని ఇంట్లో గడవక అవస్థలు పడుతున్నారు. ఈ రెండు గ్రామాలు వ్యవసాయాధారిత గ్రామాలు అయినందున సంవత్సరంలో 4 నెలలు పని ఉండి మిగతా రోజులు పనులు లేక ఖాళీగా ఉంటున్నారు.

ఈ పరిస్థితులను గమనించి అరబిందో ఫార్మా ఫౌండేషన్, ప్రవేశ ఇండస్ట్రీస్ , మహిళా అభివృధి సొసైటీ (మాస్) సంయుక్త ఆధ్వర్యం లో ఒక కుట్టు శిక్షణా కేంద్రాన్ని



ఏర్పాటు చేయడంతో 46 మంది మహిళలు ఈ అవకాశాన్ని సద్వినియోగంచేసుకొని కుట్టుపనిలో నైపుణ్యం సాధిస్తున్నారు. పెయ్యలపాలెం గ్రామంలో 22 మంది, శ్రీ రామాపురం గ్రామంలో 24 మంది మహిళలు కుట్టు శిక్షణ పొందుతున్నారు. కావలసిన కొలతలకు తగినట్టు బట్ట కత్తిరించడం, చేతికుట్టులు, మిషన్ పై కుట్టడంలో వీరికి ఇక్కడ మంచి శిక్షణ లభిస్తున్నది. శిక్షణ ప్రారంభించిన 90 రోజులలో అన్ని రకాల డిజైన్లు కుట్టేలా నేర్పిస్తున్నారు .ప్రస్తుతం వర్క్ శారీలు గౌనులు, బ్లౌస్ డిజైన్లు, పావడాలు, అనేక మోడల్స్ లో కుట్టడం నేర్చుకుంటున్నారు. శిక్షణకాలంలో కూడా కొంత మంది మహిళలు దుస్తులు కుడుతూ ఉపాధి భరోసాను పొందగలుగుతున్నారు . ■

నీకు వున్నదానితో, నీవు వున్నచోటనే, నీవు చేయగలిగిన మంచి చెయ్యి

# 'ఉద్యోగం కాదు, వ్యవసాయాన్నే ఉపాధిగా ఎంచుకోవాలి'

## విద్యావంతులకు ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు పిలుపు

చదువు పూర్తి చేసిన యువత ఉపాధి కోసం ఉద్యోగాన్ని కాకుండా వ్యవసాయరంగాన్ని ఎంచుకోవాలని ఉపరాష్ట్రపతి శ్రీ ఎం.వెంకయ్యనాయుడు పిలుపునిచ్చారు. రంగారెడ్డి జిల్లా శంషాబాద్ మండలం ముచ్చింతల్ సమీపంలో ఉన్న స్వర్ణభారత్ ట్రస్టు ఆవరణలో ఇటీవల 'రైతు నేస్తం' పురస్కారాల ప్రదానోత్సవానికి ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ముప్పవరపు ఫౌండేషన్, రైతు నేస్తం సంయుక్త ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి తెలంగాణ గవర్నర్ తమిళిసై సౌందర్‌రాజన్ హాజరయ్యారు. సమావేశంలో ఉప రాష్ట్రపతి మాట్లాడుతూ... విద్యావంతులు వ్యవసాయ రంగంలో అడుగుపెట్టి కొత్త ఆవిష్కరణలతో పాటు వ్యవసాయం లాభసాటిగా మారేలా చూడాలన్నారు. దేశంలో ప్రధానంగా వ్యవసాయం, విద్య, వైద్య రంగాలకు అధిక




ప్రాధాన్యమివ్వడానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కృషి చేయాలన్నారు. సుస్థిర వ్యవసాయంపై రైతులను ప్రోత్సహించాలన్నారు. ప్రతి ఒక్కరూ నిత్య జీవితంలో కొంత సమయాన్ని వ్యవసాయానికి, గ్రామీణ ప్రాంత వికాసానికి వెచ్చించాలని సూచించారు. వ్యవసాయం, అనుబంధ రంగాలకు ప్రసార మాధ్యమాలు అధిక ప్రాధాన్యత కల్పించాలని శ్రీ వెంకయ్య నాయుడు కోరారు.

ఛైర్మన్ ఘంటా చక్రపాణి అన్నారు. రైతులకు గిట్టుబాటు ధరలు కల్పించడం, సస్యరక్షణ చర్యలపై ప్రభుత్వాలు అండగా ఉంటాయని ఆశిస్తున్నట్లు తెలిపారు. వ్యవసాయం, అనుబంధ రంగాల్లో కృషి చేసిన పలువురికి రైతు నేస్తం పురస్కారాలను అందజేశారు. డాక్టర్ జి.వి.రామాంజనేయులుకు జీవిత



సాఫల్య పురస్కారం, విశాఖ గిరిజన సహకార సంస్థ ఎండీ డాక్టర్ టి.బాబురావునాయుడుకు 'కృషిరత్న' బిరుదును ప్రదానం చేశారు. ట్రస్టు ఆధ్వర్యంలో శిక్షణ పొందిన వారికి సర్టిఫికెట్లను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఏపీ అధికార భాషా సంఘం ఛైర్మన్ యార్లగడ్డ లక్ష్మీప్రసాద్, మాజీ మంత్రి కె.శ్రీనివాస్, రైతు నేస్తం మాసపత్రిక ఎడిటర్ వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.


**రేకులకుంట శాస్త్రవేత్తలకు**

రేకులకుంటలోని వ్యవసాయ పరిశోధన కేంద్రంలో పని చేస్తున్న విజయశంకర్‌బాబుకు, మల్లేశ్వరికి రాష్ట్రస్థాయి రైతు నేస్తం పురస్కారాలు లభించాయి. విజయశంకర్‌బాబు సేంద్రియ వ్యవసాయం, నేల సంరక్షణ, భూసార పరీక్షల ఆధారంగా ఎరువుల వాడకం, సాగునీటి యాజమాన్య పద్ధతులపై చేపట్టిన పరిశోధనలకు ఉత్తమ శాస్త్రవేత్తగా రైతు నేస్తం-2019 పురస్కారం అందజేశారు. వాతావరణ ఆధారిత పంటల విభాగంలో మల్లేశ్వరికి ఉత్తమ శాస్త్రవేత్తగా రైతు పురస్కారం అందజేశారు. ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు, తెలంగాణ రాష్ట్ర గవర్నర్ చేతుల మీదుగా వీరు పురస్కారాలను అందుకున్నారు. ■

# ఎడారి చెరువైంది, ఊరు ఉద్యానమైంది !

## వాన నీటిని ఒడిసిపట్టి సంఘటిత శక్తి సాధించిన ఘన విజయం

**రా**జస్థాన్‌లోని ఎడారి ప్రాంతంలో ఇసుకమేటలు తప్ప ఇంకేం కనిపించవనుకుంటాం. బిందెడు నీటి కోసం మహిళలు కిలోమీటర్ల దూరం వెళ్తారనే వార్తలూ విన్నాం. అయితే నీరే జీవాధారంగా ప్రకృతే ప్రాణంగా... బతుకు పచ్చదనం కోసం ఆకాశం నుంచి నేలమీద పడే ప్రతి నీటి చుక్కనూ వాళ్లు ఒడిసి పట్టుకున్నారు. ఆ నీటిని చెరువులుగా మార్చి , తమ జీవితాలు పండించుకున్నారు. ఈ బృహత్తర జలయజ్ఞానికి తొలి అడుగు వేశారు లక్ష్మణ్‌సింగ్ లపోరియా. ఆయన పేరు చివర ఉన్నది అచ్చంగా ఆ ఊరు పేరు. ఒకే ఒక్కడు... నీటి కోసం ఊరంతటిని ఒక్కతాటిపై తీసుకొచ్చిన వైనం ఆద్యంతం స్ఫూర్తిదాయకం.



'హమ్ నేచర్ కే సాథ్ రహెనా... బనానా నహీ' (మనమంతా ప్రకృతితో మమేకమై ఉండాలేగానీ దాని సహజత్వాన్ని దెబ్బతీయొద్దు) 63 ఏళ్ల లక్ష్మణ్‌సింగ్ 30 ఏళ్ల అనుభవంతో గట్టిగా చెప్పే మాటలివి. లపోరియా గ్రామాన్ని ప్రత్యక్షంగా చూస్తేగానీ ఆయన చెప్పిన మాటల్లోని భావం మనకు అర్థం కాదు.

**గ్రామ వికాస్ నవ యువక్ మండల్...**

లపోరియా (లపోడియా అని కూడా అంటారు) అంటే 'పిచ్చోళ్లు ఉండే ప్రాంతం ' అని అర్థం. పనీపాటా లేని వాళ్లను 'లపోడ్ ' అంటారు. రాజస్థాన్ రాజధాని జైపూర్ నగరానికి సుమారు 90 కిలోమీటర్ల దూరంలో ఉన్న ఈ ఊరిలో నీటి చుక్క కూడా లేకపోవడంతో స్థానికులకు దిక్కు తోచలేదు. తాగడానికి నీళ్ళు లేక ఆవులు చనిపోయేవి. ఏం చేయాలో తెలియక గ్రామస్థులు ఆగ్రా, చండీగఢ్, హర్యానా, ఢిల్లీకి వలస పోయారు. ఊరిలో మిగిలినవాళ్ళు పనీపాటా లేక లపోడ్‌లాగా తిరిగేవారు. అందరూ తమ ఊరివాళ్ళ ను లపోడ్ అంటూ ఎగతాళి చేయడం ఆయనకు అస్సలు నచ్చలేదు. వారంతా అలా అనడానికి కారణాలను అన్వేషించారాయన. ఊళ్ళో నీళ్ళు లేవు కాబట్టే తమకు పనీపాటా లేకుండా పోయిందని, నీళ్ళుంటే జీవితాలు మారతాయని భావించారు.

పదో తరగతి మాత్రమే చదువుకున్న లక్ష్మణ్‌సింగ్ గ్రామానికి వాన నీరే దిక్కు కాబట్టి దాన్ని ఒడిసి పట్టుకోవాలనుకున్నారు. అయితే అది తన ఒక్కడి వల్ల అయ్యే పని కాదని గ్రహించారు. ఊరిని ఆనుకుని ఒక పెద్ద చెరువులాంటిది ఉంది. కానీ అది నీళ్ళు లేక బీడువారింది. మొదట్లో తన స్నేహితుడితో కలిసి ఒకటిన్నర కిలోమీటర్ల ఆ ప్రాంతాన్ని తవ్వడం మొదలెట్టారు. వారి ప్రయత్నాన్ని చూసి ఊరిలోని మరికొందరు యువకులు వారితో జత కలిశారు. ఆ విధంగా 1976లో 'గ్రామ వికాస్ నవ యువక్ మండల్ లపోరియా' (జీవీఎన్ఎంఎల్) మొదలయ్యింది. ఆ చెరువును 15 అడుగుల లోతు తవ్వి, గ్రామంలో కురిసిన ప్రతీ వానచుక్క అందులోకి వచ్చేలాగా ఏర్పాటు చేశారు. దానికి 'అన్నా సాగర్' అని పేరు పెట్టారు. ఆ తర్వాత దానికి అనుసంధానంగా మరో రెండు చిన్న చెరువులు కూడా తవ్వారు. వాటికి 'ఫూల్ సాగర్', 'దేవ్ సాగర్ 'గా పేర్లు పెట్టారు. 'అన్నా సాగర్ అంటే అన్నం పెట్టే చెరువని అర్థం. ఈ చెరువులోని నీటిని వ్యవసాయానికి మాత్రమే వాడతాం. ఫూల్ సాగర్‌లో పూలుంటాయి. దేవ్ సాగర్ ఒడ్డున

దేవాలయాలుంటాయి. ఈ రెండు చెరువులు కూడా భూజలాన్ని రీఛార్జ్ చేస్తాయి. మొత్తంగా ఈ మూడూ కూడా గొలుసుకట్టు చెరువులు. ఈ మూడు చెరువులతో మా ఊరి ముఖచిత్రమే మారిపోయింది' అన్నారు లక్ష్మణ్‌సింగ్.

**పచ్చదనం వికసించింది!**



కొన్నేళ్ల పాటు నిరంతరాయంగా సాగిన ఈ మహా యత్నంతో ఎట్టకేలకు లపోరియాలో నీటి నిల్వలు అనూహ్యంగా పెరిగాయి. చెరువులు నిండు కుండల్లా మారాయి. ఆ ప్రాంతమంతా తేమతో నిండిన నేలతో పచ్చగడ్డి మొలిచింది. క్రమక్రమంగా వలస పోయిన గ్రామస్థులు లపోరియాకు తిరిగి రావడం మొదలెట్టారు. వందకు పైగా యువకులున్న జీవీఎన్ఎంఎల్ కృషితో ప్రతీ ఏడాది 1800 ఎకరాల్లో ఊరి రైతులు పెసర, మొక్కజొన్న, నువ్వులు మొదలైన పంటలు పండిస్తున్నారు. వాన నీటిని భూమిలో రీఛార్జ్ చేయడం ద్వారా ఆ ప్రాంతంలో ఫ్లోరైడ్ 2.1 పీపీఎం నుంచి 0.95కు, నైట్రేట్ 30.5 నుంచి 17.5కు తగ్గినట్టుగా శాస్త్రవేత్తలు తేల్చారు.

**అడవిలో ఉన్నట్టు...**

'మా గ్రామంలోకి అడుగుపెట్టేప్పుడే ఒక బోర్డు చూసి ఉంటారు. ఇక్కడంతా సహజ సిద్ధమైన వ్యవసాయం చేస్తాం. రసాయనిక ఎరువులు, రసాయనిక పురుగు మందులు అస్సలు వాడం. చెట్లను నరకడం, జంతువులను చంపడం లాంటివి చేయరాదు. జీవావరణ వ్యవస్థను కాపాడుకోవాలన్నదే మా ప్రధాన ఉద్దేశం. గ్రామంలో 10 శాతం భూమిని వన్య జీవన సంరక్షణ క్షేత్రం (విలేజ్ ఫారెస్ట్) కోసం కేటాయించాం. అందులోకి ఎవరూ వెళ్లరాదనే కట్టుబాటు పెట్టుకున్నాం. దాంతో పక్షులు పెరిగాయి. అనేక పక్షులు ఇక్కడకు వలస వస్తున్నాయి కూడా. ఇటీవలే పెద్ద కళ్ల గుడ్లగూబ ఈ ప్రాంతంలో కనిపించిందని పరిశోధకులు చెప్పారు. సాధారణంగా పర్యావరణ స్థితి (ఎకాలజీ సిస్టమ్) సరిగ్గా ఉన్నచోటే గుడ్లగూబలు?కనిపిస్తాయని వారన్నారు. చీమలు, ఎలుకలు, పక్షులు, జంతువులు, పాములు... అన్నీ కూడా అడవిలో



ఉన్నట్టుగానే ఉంటాయి. ప్రస్తుతం అడవిలోనే మా గ్రామం ఉన్నట్టుగా తయారైంది. ఇది 30 ఏళ్లకు పైగా గ్రామస్థులంతా కలిసి కట్టుగా చేసిన కృషికి ఫలితం' అన్నారు లక్ష్మణ్‌సింగ్.

మరో విశేషం ఏమిటంటే గ్రామస్థులెవరూ మాంసాహారం ముట్టరు. జీవహింసకు దూరంగా ఉంటారు.' ప్రకృతి దైవం లాంటిది. భూమి తల్లి లాంటిది. లాభాపేక్ష కోసం వాటిని ఉపయోగించడం మొదలెడితే మొదటికే మోసం వస్తుంది. వాటి విలువ తెలుసుకుని వాటిని పరిరక్షించుకుంటున్నాం. ఇది ఎవరి కోసమో చేస్తున్నది కాదు. మా జీవనం కోసం మేము చేస్తున్న పవిత్రయజ్ఞం ' అంటున్న లక్ష్మణ్‌సింగ్ 350 ఏళ్ల క్రితం ఆయన తాతముత్తాతలు నిర్మించిన ఇంట్లోనే ఉంటున్నారు. దాన్ని 40 ఏళ్ళకు ఒకసారి పునరుద్ధరిస్తామని చెప్పారు. లక్ష్మణ్‌సింగ్‌కు భార్య, ముగ్గురు కూతుళ్ళు ఒక కొడుకు ఉన్నారు. 'బిడ్డల పెళ్లిళ్ళు చేశా. కొడుకు చదువుకుంటున్నాడు. మాకు కొంత పొలం ఉంది. దాన్ని సాగు చేసుకుంటూ గ్రామాభివృద్ధి కోసం పాటుపడుతున్నా. రాజకీయాలపై నాకు ఏ మాత్రం ఆసక్తి లేదు' అంటున్న లక్ష్మణ్‌సింగ్ ఎడారిలో చెరువులు సృష్టించినందుకు అనేక అవార్డులు అందుకున్నారు. జాతీయ, అంతర్జాతీయ ప్రశంసలు అందుకున్నారు. అయినప్పటికీ ఓ సాధారణ వ్యక్తిలా ఉండడానికే ఆయన ఇష్టపడతారు.

జ్ఞానానికి ప్రధాన శత్రువు తెలివిలేనితనం కాదు, తెలుసుననే భ్రమ

'ఇప్పటికైనా ఊరు పేరు మారుస్తారా అని చాలామంది అడుగుతుంటారు. ఎందుకు మార్చాలి, మమ్మల్ని లపోడ్ అనుకోనివ్వండి. మేము ప్రకృతి పిచ్చోళ్ళం. ఇలాగే ఉంటాం' అంటూ చిన్నగా నవ్వారు లక్ష్మణ్‌సింగ్ లపోరియా.

**చెట్లు, చెరువులకు పూజలు!**

లపోరియా గ్రామస్తులకు నీటి విలువ, పర్యావరణం విలువ బాగా తెలుసు. ఊరంతా ఒకే మాటపై ఉంటుంది. గ్రామంలో ప్రతీ ఒక్కరికీ అక్కడి చెట్లు, చెరువులపై ప్రేమ ఉంది. అందుకే చెట్లకు, చెరువులకు పూజలు చేసేందుకు ఊరు ఊరంతా కలిసి వస్తుంది. 350 కుటుంబాలున్న (2,500 మంది జనాభా) ఈ గ్రామంలో ఏ పని చేయాలన్నా ముందుగా తీర్మానంచేసి ఆ తర్వాత ఆ పనిలో పిల్లల దగ్గరి నుంచి వృద్ధుల దాకా అంతా తలో చేయి వేస్తారు. పశుపక్ష్యాదులు నీరు తాగేందుకు సహజ సిద్ధంగా ఉండే అనేక రకాల కుంటలు తవ్వారు. కాలువలపై చెక్‌డ్యాములు నిర్మించారు.

**నీటి సంరక్షణకు 'చౌకా' విధానం**

కేవలం చెరువులను తవ్వడంతోనే లక్ష్మణ్‌సింగ్ చేతులు దులుపుకోలేదు. వాననీటి సంరక్షణ విషయంలో మెట్ట ప్రాంతాల్లో అనుసరించే 'చౌకా ' విధానాన్ని ఏర్పాటు చేశారు. గ్రామ శివార్లలో ఒక పద్ధతి ప్రకారం నలు చదరపు గుంతలు తవ్వారు. వాటి గురించి గ్రామస్థుల్లో అవగాహన కల్పించారు. ఒక చౌకా నిండాక, దానినుంచి మరో చౌకాకు వాన నీరు పొంగి పొర్లేలా వాటిని డిజైన్ చేశారు. ఎత్తుపల్లాలుగా ఉన్న భూమిపై ఒకరకంగా, పల్లంగా ఉన్న భూమిపై మరో రకంగా, మైదాన ప్రాంతాల్లో ఇంకో రకంగా... మొత్తం మూడు విధాల చౌకాలను డిజైన్ చేశారు. ఆకాశం నుంచి నేలపై పడే ప్రతీ వాన చినుకునూ ఒడిసి పట్టుకున్నారు

**(ఆంధ్రజ్యోతి సౌజన్యంతో ...)** ■

# మూడు చెక్కల గొర్రుతో కూలీల ఖర్చు సగం!

పెట్టుబడులు నానాటికీ పెరిగిపోవడంతో రైతులు సేద్యం చేయాలంటేనే వెనుకడుగు వేస్తున్నారు. ముఖ్యంగా పైరులో కలుపు తీసేందుకు కూలీల ఖర్చు తడిసి మోపెడవుతోంది. ఎంత ఖర్చు చేసినా కొన్నిసార్లు కూలీలు దొరకడం కష్టమవుతోంది. ఈ నేపథ్యంలో ఖర్చు తగ్గించుకునే మార్గం ఏదైనా ఉందా అని రైతులు ఆలోచించారు. వారి మదిలో మెరిసిన ఉపాయమే ఈ మూడు చెక్కల గొర్రు. ఈ పరికరాన్ని సజ్జ, జొన్న, మొక్కజొన్న సాగులో ఉపయోగిస్తారు. దీని ద్వారా కలుపు తీస్తే ఖర్చు సగానికి పైగా ఆదా అవుతుంది. ఉదాహరణకు ఒక ఎకరం కీర దోస పంటలో కలుపు తీసేందుకు 30 మంది కూలీలు అవసరం. ఒక్కొక్కరికీ రూ. 200 కూలి ఇవ్వాలి. ఈ ప్రకారం ఎకరాకు ఖర్చు రూ. 6000 అవుతుంది. అదే మూడు చెక్కల గొర్రుతో అయితే మొక్కల మొదళ్లలో గడ్డి తీయడానికి 10 మంది, సందుల్లో గొర్రు లాగడానికి ముగ్గురు కలిపి 13 మందే సరిపోతారు. ఈ పద్ధతి ప్రకారం రూ. 2600 మాత్రమే ఖర్చు వస్తుంది. ఈ తేడాను గమనించిన అన్నదాతలు చాలా వరకు ఈ పద్ధతినే అనుసరిస్తున్నారు. కడప జిల్లా పోరుమామిళ్ల మండలంలోని చిన్నఎరసాల గ్రామానికి చెందిన సుబ్బరాయుడు, రామసుబ్బయ్య, నరసింహులు అనేవారు కమ్మవారిపల్లెలో నాలుగు ఎకరాలు కౌలుకు తీసుకొని సాగు



చేశారు. వారు తమ పొలంలో ఇలా కలుపు తీస్తూ కనిపించారు. కూలీల ఖర్చు తగ్గించే ఈ పరికరం రైతుల పాలిట వరంగా భావిస్తున్నారు. ■

విజేత నకిలీ మిత్రులను , సిసలైన శత్రువులను సంపాదించుకుంటాడు

# చిరుధాన్యాల సాగులో మహిళా రైతుల ముందంజ !

## అనకాపల్లిలో వేల ఎకరాల్లో సాగు ..960 మంది మహిళలకు నిత్యం ఉపాధి

విశాఖ జిల్లాకు చెందిన 960 మంది మహిళా రైతులు చిరుధాన్యాలను సాగు చేయడంతో పాటు వాటిని శుద్ధి చేసి, ప్యాకింగ్ చేసి విక్రయిస్తున్నారు. చిరుధాన్యాలతో చిరుతిళ్లు తయారు చేసి మంచి లాభాలు పొందుతున్నారు. సాగులో అద్భుతాలు చేస్తూ 'చిరుధాన్యాల చెల్లెమ్మలు'గా పేరొందిన ఆ మహిళల ప్రయాణం ఇది.

మహిళా రైతుల ఆదాయాన్ని పెంచి వారికి సుస్థిరమైన ఉపాధిని కల్పించే ఉద్దేశంతో 'శారదావేలీ డెవలెప్‌మెంట్ సమితి' ఆధ్వర్యంలో 'సుసాగ్ చిరుధాన్య ఉత్పత్తిదారుల సంఘం' ఏర్పాటైంది. రైతులకు ప్రోత్సాహం కల్పించాలన్న ఉద్దేశంతో కేంద్ర ప్రభుత్వం దేశవ్యాప్తంగా పదివేల రైతు ఉత్పత్తిదారుల సంఘాలను ఏర్పాటుచేసింది. అందులో భాగంగా అనకాపల్లి మండలంలో ఉన్న మామిడిపాలెం గ్రామంలో సుసాగ్ చిరుధాన్య ఉత్పత్తిదారుల సంఘం ప్రారంభమైంది. ఈ సంఘంలో అనకాపల్లి, పెదబయలు మండలాల నుంచి 960 మంది మహిళా రైతులను సభ్యులుగా చేర్పించారు. వీరి నుంచి 500 రూపాయల చొప్పున సభ్యత్వం సేకరించారు. దానికి తోడుగా నాబ్‌కిసాన్ ఫైనాన్స్ లిమిటెడ్ సంస్థ రూ. 27లక్షలు రుణం ఇచ్చింది. ఆ డబ్బుతో మహిళలంతా ఉమ్మడి సేద్యం ప్రారంభించారు అనకాపల్లి మండలంలోని మామిడిపాలెం, బవులవాడ, మార్టూరు, సీహెచ్.ఎన్. అగ్రహారం, దిబ్బపాలెం, తుమ్మపాల గ్రామాలతో పాటు పెదబయలు మండలంలోని పలు గ్రామాల నుంచి వచ్చిన చిరుధాన్య చెల్లెళ్లు ఏకమయ్యారు. వీరంతా పెద బయలు మండలంలో రెండు వేల ఎకరాల భూమిని సాగుకు తీసుకున్నారు. ఈ భూమిలో రాగులు, గంట్లు, కొర్రలు, సామలు తదితర చిరుధాన్య పం టలు సాగుచేయడం ప్రారంభించారు. 2016 లో సాగు ప్రారంభించగా తొలి ఏడాది రూ. ఆరువేలు నష్టం వచ్చింది. అయినా ఆ మహిళలు వెనుకడుగు వేయలేదు. మరుసటి సంవత్సరం అద్భుత ఫలితాలు సాధించారు. పండిన పంటను చిరుధాన్య చెల్లెళ్లు పొట్టు తీసి, చెరిగి, శుభ్రపరచి, ప్యాకెట్లు చేశారు. నాట్లు వేసింది మొదలు ప్రోసెస్ చేసి మార్కెటింగ్ జరిగే వరకు కూడా చెల్లెళ్లదే బాధ్యత. ఏజెన్సీలో పండిన పంటను అక్కడ ప్రోసెస్ చేసి అనకాపల్లి మండలంలోని మామిడి పాలేనికి తీసుకొస్తారు. ఇక్కడ ప్యాకెట్లు చేసి విశాఖ నగరంలో విక్రయిస్తారు. వారానికి ఒకసారి విశాఖపట్నంలో ఉన్న అపార్ట్‌మెంట్లకు తీసుకెళ్లి అక్కడ స్టాల్స్ ఏర్పాటుచేసి విక్రయిస్తారు.



అలాగే చిరుధాన్యాలతో బిస్కెట్లు, జంతికలు, చెగోడీల వంటివి కూడా తయారుచేసి విక్రయిస్తున్నారు. తుమ్మపాల గ్రామంలో ఒక దుకాణాన్ని కూడా ఏర్పాటుచేసి విక్రయాలు చేస్తున్నారు. ఈ రోజుల్లో చిరుధాన్యాలకు డిమాండ్ పెరగడం, ఈ మహిళలు సేంద్రియ పద్ధతిలో సాగు చేయడం వల్ల ఆ పంటకు మంచి డిమాండ్ ఏర్పడింది. మూడేళ్లలో నాబ్ కిసాన్ సంస్థ నుంచి తీసుకున్న రూ. 27 లక్షలు అప్పు తీర్చేశారు. ఇప్పుడు కోటి రూపాయలు రుణం ఇచ్చేందుకు సంస్థ ముందుకు వచ్చింది. ఈ మహిళలు విలక్షణమైన సాగు పద్ధతుల్ని అవలంబిస్తున్నారు. శ్రీవరి సాగు మాదిరిగా శ్రీరాగి పద్ధతిలో రాగులు సాగు చేస్తున్నారు. దీనివల్ల అధిక దిగుబడి వస్తోంది. పూర్తిగా సేంద్రియ పద్ధతిలో సేద్యం చేస్తున్నారు. దేశీ ఆవుల మూత్రంతో జీవామృతాలు తయారుచేసి పంటలకు ఉపయోగిస్తున్నారు. దీనివల్ల పెట్టుబడి తక్కువ లాభాలు ఎక్కువగా వస్తున్నాయంటున్నారు చిరుధాన్యాల చెల్లెళ్లు. ■

మనసు , మాట , చేత ఒక్కటైనప్పుడు కలిగేదే అసలైన ఆనందం

# ప్రకృతి సేద్యానికి జోడీగా సేంద్రియ యూరియా !

ఇసుక, ఆవు మూత్రంతో 30 రోజుల్లో తయార్ ...పెద్దగా ఖర్చూ లేదు.. పర్యావరణ కాలుష్యమూ లేదు

**ఆ**రుగాలం చెమటోడ్చి వ్యవసాయం చేసే రైతులు స్వతహాగా స్వేచ్ఛా జీవులు. అయితే, విత్తనాలు, ఎరువులకు, పురుగుమందులకు పూర్తిగా మార్కెట్‌పైనే ఆధారపడడంతో సమస్యల్లో చిక్కుకుంటున్నారు. ఉత్పాదకాలన్నిటినీ దుకాణాల్లో కొనుక్కొని వాడుకోవడానికి అలవాటు పడిన రైతులు ఆర్థికంగా నష్టపోవడంతోపాటు తమకున్న స్వేచ్ఛను కోల్పోతున్నారు. యూరియా వంటి రసాయనిక ఎరువు బస్తాల కోసం తెలంగాణ జిల్లాల్లో రైతులు రోజుల తరబడి క్యూలలో నిలబడుతూ నానా బాధలు పడుతున్నారు. అయితే, జగిత్యాల జిల్లాలో కొందరు ప్రకృతి వ్యవసాయదారులు మాత్రం తమ స్వేచ్ఛను నిలబెట్టుకుంటున్నారు. తమ పంటలకు అవసరమైన సేంద్రియ యూరియాను ఇసుక, ఆవు మూత్రంతో తామే తయారు చేసుకుంటూ నిశ్చింతగా పంటలు పండించుకుంటున్నారు. అటువంటి ఓ యువ రైతు సోదరుల విజయగాథను 'సాక్షి' పత్రిక 'సాగుబడి'లో ప్రచురించింది. ఆ పత్రిక సౌజన్యంతో ఆ విశేషాలను తెలుసుకుందాం.

దండవేని నరేష్, సురేష్ అన్నదమ్ములు, యువకులు. తెలంగాణ రాష్ట్రంలోని జగిత్యాల జిల్లా రాయికల్ మండలంలోని అల్లీపూర్ వారి స్వగ్రామం. ఐదేళ్లుగా 8 ఎకరాల్లో ప్రకృతి వ్యవసాయ పద్ధతుల్లో పంటలు సాగు చేస్తున్నారు. పాలేకర్, చౌహాన్ క్యు, సీవీఆర్ మట్టిసేద్యంపై యూట్యూబ్‌లో వీడియోలు చూసి ప్రకృతి వ్యవసాయం చేపట్టి అభివృద్ధి పథంలో సాగుతున్నారు.

రెండెకరాల్లో 16 రకాల కూరగాయలు, 3 ఎకరాల్లో వరి, మిగతా 3 ఎకరాల్లో చిరుధాన్యాలు, పసుపు తదితర పంటలు పండిస్తున్నారు. రసాయనాలు వాడకుండా తాము పండించిన సేంద్రియ ఉత్పత్తులను జగిత్యాల పట్టణంలో సొంతంగా స్టాల్ ఏర్పాటు చేసుకొని మార్కెట్ ధరపై 10% అధిక ధరకు స్వయంగా అమ్ముకుంటూ మంచి ఆదాయం పొందుతున్నారు.

నరేష్, సురేష్ పంటలకు ఘనజీవామృతం, జీవామృతం, లాక్టిక్ యాసిడ్ బాక్టీరియా, మట్టి ద్రావణం, చేప అమినోయాసిడ్ ద్రావణం, జీవన ఎరువులు వంటి వాటిని పంటల పోషక అవసరాలకు తగినట్లుగా వాడుతూ ఉంటారు. వీటిని స్వయంగా తామే తయారు చేసుకుంటారు. అయితే, రెండేళ్లుగా ఇసుక, ఆవు మూత్రంతో సేంద్రియ యూరియాను కూడా తయారు చేసుకొని పంటలకు వేసుకుంటున్నారు.



ఇసుక యూరియాను పొలంలో చల్లుతున్న నరేశ్

**30 రోజుల్లో సేంద్రియ యూరియా సిద్ధం**

సేంద్రియ యూరియాకు కావాల్సిన ముడి పదార్థాలు.. ఇసుక, నాటు ఆవు మూత్రం. యూరియా తయారీకి నాటు ఆవు మూత్రం శ్రేష్టమని, దీనితోపాటు ఏ పశువు మూత్రమైనా వాడుకోవచ్చని నరేష్, సురేష్ చెబుతున్నారు. దగ్గరలో ఉన్న వాగు నుంచి ఇసుకను సేకరించుకోవాలి. అందులో రాళ్లు, రప్పలు లేకుండా జల్లించుకోవాలి. వర్షం, ఎండ పడకుండా కొష్టం/షెడ్‌లో సేంద్రియ యూరియా తయారు చేసుకోవాలి. ఇందుకు 30 రోజులు పడుతుంది. మొదటి 20 రోజులు ఇసుకలో ఆవు మూత్రం రోజూ కలుపుతూ తడిగా ఉంచాలి. తర్వాత 10 రోజులు ఆ ఇసుకకు గాలి తగలకుండా ప్లాస్టిక్ షీట్‌లో మూటగట్టి ఉంచాలి.

**వాడకానికి సిద్ధమైన సేంద్రియ ఇసుక యూరియా**

తయారు చేసే విధానం: ఇసుకను ఒక పెద్ద నల్లని ప్లాస్టిక్ కవర్‌పై పోయాలి. 100 కిలోల ఇసుకపై 10-12 లీటర్ల

అవివేకమంటే ఈ సారి ఫలితం మరోలా వుంటుందనే ఆశతో చేసిన తప్పునే మళ్లీ మళ్లీ చేస్తుండడం

నాటు ఆవు మూత్రాన్ని పోసి, ఇసుక పూర్తిగా తడిసేలా కలగలపాలి. తర్వాత, గాలి చొరబడకుండా కవర్ కట్టేయాలి. 19 రోజుల పాటు రోజూ కవర్‌ను విప్పి, ఇసుక తడి ఆరకుండా ఉండేంత ఆవు మూత్రాన్ని చల్లి.. మళ్లీ కవర్‌ను గట్టిగా తాడుతో కట్టి నీడలో ఉంచాలి. 20 రోజులకు ఇసుక యూరియా పసుపు నుంచి నల్లని రంగులోకి మారుతుంది. ఇక సేంద్రియ యూరియా వాడకానికి సిద్ధమైనట్టే.

**సేంద్రియ యూరియా తయారీకి మరో పద్ధతి**

సేంద్రియ యూరియాను మరింత సులభంగా తయారు చేసుకునే పద్ధతి మరొకటి ఉందని రైతు శాస్త్రవేత్త కొక్కు అశోక్‌కుమార్ (98661 92761) తెలిపారు. పశువుల చావిడిలో నేలపైన ఇసుక పోసి, అక్కడ పశువులను కట్టేయాలి. అవి పేడ వేస్తాయి, మూత్రం పోస్తాయి కదా. పేడను విడిగా తీసుకొని.. మూత్రంతో తడిసిన ఇసుకను ఏరోజుకారోజు తీసి పక్కన కుప్పగా పోసుకోవాలి. పశువుల మూత్రమే కాదు మనుషుల మూత్రం కూడా సేంద్రియ యూరియా తయారీకి అద్భుతంగా పనిచేస్తుంది. అలా 20 రోజులు చేయాలి. 21వ రోజున ఆ ఇసుకకు గాలి ఆడకుండా ఉండేలా మూటగట్టి 10 రోజుల తర్వాత తీయాలి. అంతే.. సేంద్రియ యూరియా సిద్ధం!

రసాయనిక యూరియా పంటపై చల్లితే ఎక్కువ తక్కువగా పంటకు అందుతుందని, అది కూడా 20% మాత్రమేనని, మిగతాది వృథా అవుతుందని కొక్కు అశోక్‌కుమార్ అన్నారు. సేంద్రియ యూరియా పంటపై చల్లినప్పుడు సమానంగా, పుష్కలంగా అందుతుందని తెలిపారు. పర్యావరణ కాలుష్యం, నీటి కాలుష్యం దీనివల్ల ఉండదని, మోతాదు ఎక్కువైనా పంటకు నష్టం ఉండదని, చీడపీడలు విజృంభించవని అన్నారు. రైతులందరూ సేంద్రియ యూరియాను తయారు చేసుకొని వాడుకుంటే ఆర్థికంగా, పర్యావరణపరంగా, భూసారం పరంగా ఎంతో మేలు జరుగుతుందని ఆయన అన్నారు.

**ఎకరానికి 200 కిలోలు**

రైతు శాస్త్రవేత్త కొక్కు అశోక్‌కుమార్ గత ఖరీఫ్‌కు ముందే జగిత్యాలలో రైతులకు సేంద్రియ యూరియా తయారీపై శిక్షణ ఇచ్చారు. నరేష్, సురేష్ కూడా ఆయన దగ్గరే నేర్చుకున్నారు. వాళ్లు వరి సాగుకు సేంద్రియ యూరియా వాడటం ఇది వరుసగా మూడో సీజన్. నాటు వేసిన 20 రోజులకు ఎకరానికి 200 కిలోలు, పొట్ట దశలో మరో 200 కిలోల సేంద్రియ యూరియా చల్లుతున్నారు. 2018 ఖరీఫ్‌లో ఎకరానికి 28 క్వింటాళ్లు, రబీలో 25 క్వింటాళ్ల ధాన్యం దిగుబడి పొందారు. రసాయనిక యూరియా కోసం తోటి రైతులు రోజుల తరబడి క్యూలలో నిల్చుంటూ ఉంటే.. ఈ యువ రైతులు మాత్రం.. స్వల్ప ఖర్చుతో ముందే తాము తయారుచేసి పెట్టుకున్న సేంద్రియ యూరియాను సకాలంలో వరి పంటకు అందించడంతోపాటు పొటాషియాన్ని అందించే పొగాకు కషాయం పిచికారీ చేసి నిశ్చింతగా ఉన్నారు.

వర్షం పడని చోట దాచుకుంటే 1–2 రెండేళ్ల వరకు నిల్వ ఉంచుకొని వాడొచ్చని నరేష్(96409 63372), సురేష్ తెలిపారు. ప్లాస్టిక్ కవర్‌కు బదులు సిమెంటు తొట్టెలో సైతం సేంద్రియ యూరియాను సులభంగా, పెద్దమొత్తంలో తయారు చేసుకునే వీలుంది. ఎకరానికి విడతకు 100 నుంచి 200 కిలోలు వేసుకోవచ్చు. రసాయనిక యూరియా వేసిన తర్వాత పంటకు చీడపీడల బెడద ఎక్కువ అవుతుందని, సేంద్రియ యూరియా వల్ల ఆ సమస్య రాలేదన్నారు. సేంద్రియ యూరియాపై భారతీయ వ్యవసాయ పరిశోధనా మండలి లోతైన పరిశోధనలు చేసి ఫలితాలను వెల్లడిస్తే రైతులకు మరింత మేలు జరుగుతుంది. **(సాక్షి సౌజన్యంతో)** ■

## బీహార్ బృందం మండల సమాఖ్య సందర్శన

భిక్కనూరు మండల సమాఖ్యను బీహార్ బృందం ఇటీవల సందర్శించింది. ఈసందర్భంగా స్థానిక మహిళా సంఘాలు అమలు చేస్తున్న ఆడిటింగ్, పుస్తక నిర్వహణ, ప్రతి నెలా నిర్వహించే సమావేశాలు, చిన్న సంఘాల పురోగతి, ప్రభుత్వ కార్యక్రమాలపై ప్రజలకు అవగాహన కలిగించే అంశాలను తెలుసుకున్నారు. కార్యక్రమంలో మండల సమాఖ్య అధ్యక్షురాలు లక్ష్మి, చంద్రకళ, వనజ, పద్మ, స్వప్న, ఏపీఎం రాజయ్య, శ్రీనివాస్, వినోద పాల్గొన్నారు.

# పది పంటలపై నంద్యాల ఆర్ఏఆర్ఎస్ పరిశోధన

వాతావరణ మార్పులు.. గతి తప్పుతున్న రుతు పవనాలు.. అకాల వర్షాలు.. ఉష్ణోగ్రతలు పెరగడం.. నీటి వనరులు తగ్గడం.. ఇలా ఎన్నో పరిణామాలతో కొన్నేళ్లుగా వ్యవసాయం తిరోగమనం దిశగా పయనిస్తోంది. పంటల సాగులో రైతులకు వరుసగా నష్టాలే. ఈ క్రమంలో వాతావరణ పరిస్థితులను ఎవరూ మార్చలేరు. ఆ పరిస్థితులను అధిగమించే నూతన వంగడాలను సృష్టించడమే వ్యవసాయ శాస్త్రవేత్తల లక్ష్యం. ఈ మేరకు నంద్యాల (ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం) ఆర్ఏఆర్ఎస్ శాస్త్రవేత్తలు నూతన వంగడాల ఆవిష్కరణలో ముందంజలో ఉన్నారు. ప్రకృతి వైపరీత్యాలను తట్టుకునేలా,



తెగుళ్ల బారిన పడకుండా.. అధిక దిగుబడి వచ్చేలా నూతన వంగడాలను సృష్టిస్తున్నారు. వ్యవసాయంలో రైతులు రాణించేలా మేలు రకం విత్తనాలు అందిస్తూ రాష్ట్రవ్యాప్తంగా నంద్యాల పరిశోధన కేంద్రానికి మంచి గుర్తింపు తెస్తున్నారు.

ఆచార్య ఎన్జీరంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం 1906లో నంద్యాల పట్టణంలోని నూనెపల్లెలో 125 ఎకరాల విస్తీర్ణంలో ఏర్పాటు చేశారు. 25 ఎకరాలలో భవనాలు ఉండగా మరో 100 ఎకరాల్లో వివిధ పంటలు సాగు చేస్తూ పరిశోధనలు చేస్తున్నారు. రాష్ట్రంలో ఎక్కడా లేని విధంగా పది పంటలపై పరిశోధన కొనసాగుతుంది. దాదాపు 25 మంది శాస్త్రవేత్తలు ఇక్కడ పని చేస్తున్నారు. ఈ పరిశోధన కేంద్రానికి 2017లో గుంటూరు ఆచార్య విశ్వవిద్యాలయం నుంచి బెస్ట్ పరిశోధన సంస్థగా అవార్డు దక్కింది. ఇక్కడ ఆవిష్కరించిన పత్తి, నంద్యాల సోనా వంగడాలకు రాష్ట్ర వ్యాప్తంగా పేరొందాయి. 1950లో పత్తి, 1980లో జొన్న, పొద్దుతిరుగుడు, శనగ, పొగాకు, తదితర పంటలపై పరిశోధనలు ప్రారంభించారు. అప్పటినుంచి ఇప్పటివరకు అనేక పంటలపై పరిశోధనలు చేయడం, వాటి గురించి రైతులకు అవగాహన కల్పించడం, ఆ మేరకు కొత్త వంగడాలను సృష్టించడంలో ఆర్ఏఆర్ఎస్‌కు మంచి గుర్తింపు వచ్చింది. పత్తి, పొద్దుతిరుగుడు, చిరుధాన్యాలు, పొగాకు, శనగ, జొన్న, వరిలో అధిక దిగుబడులు వచ్చే నూతన వంగడాలను సృష్టించి అరుదైన ఖ్యాతిని సొంతం చేసుకున్నారు. నంద్యాల శాస్త్రవేత్తలు రామారెడ్డి, విజయలక్ష్మి, గాయత్రి, జాఫర్‌బాషా తదితరులు నూతన వంగడాల ఆవిష్కరణలను వివరించారు.

**శనగకు నంద్యాల బ్రాండ్..**

రాయలసీమలో శనగ పంటను ఎక్కువగా సాగు చేస్తారు. ఈ పంటకు ఉన్న ప్రాముఖ్యతను గుర్తించి 2009లో నంద్యాల పరిశోధన స్థానంలో అధిక దిగుబడి వచ్చే మేలైన విత్తనాల ఆవిష్కరణకు శ్రీకారం చుట్టారు. 2012లో నంద్యాల శనగ-1, 2015లో నంద్యాల ధీర, 2016న నంద్యాల గ్రామ్-49, 2015లో నంద్యాల గ్రామ్-119 శనగ విత్తనాలను ఆర్ఏఆర్ఎస్ నుంచి ఉత్పత్తి చేశారు. ఈ విత్తనాలను ఎక్కడ వాడినా నంద్యాల పేరు గుర్తుండాలనే ఉద్దేశంతో పేరుకు ముందుగా నంద్యాలను చేర్చినట్లు తెలుస్తోంది. శనగను ఇంగ్లీష్‌లో బెంగాల్ గ్రామ్ అంటారు. అందుకే నంద్యాల గ్రామ్-119, నంద్యాల గ్రామ్-49 పెట్టారు. నూతన వంగడాలకు 1, 2 తడులు నీరు పెడితే చాలి. ఈ రకాలు దృఢమైన వేరు వ్యవస్థ నీటి బెట్ట, ఎండ తెగులును తట్టుకుంటాయి. శనగ గింజ బరువు 38 నుంచి 40 గ్రాములు ఉంటుంది. వర్షాధారం నేలలు అయితే ఎకరాకు 10 నుంచి 11 క్వింటాళ్లు, మిగిలిన పొలాల్లో ఎకరాకు ఏడెనిమిది క్వింటాళ్లు దిగుబడి వస్తుంది. వీటి పంట కాలం 90 నుంచి 105 రోజులు.

**వ్యవసాయ యాంత్రీకరణ..**

కొత్త వంగడాలను సృష్టించడంతో పాటు రైతులకు అవసరమైన యంత్రాలను ఆర్‌ఏఆర్‌ఎస్‌లో తయారు చేస్తున్నారు. ఇక్కడ తయారుచేసిన 16హెచ్‌పీ ట్రాక్టర్‌తో అనుసంధానం చేసే పరికరాలు, రెండు చెక్కల నాగలి, ఆరు చెక్కల కల్టివేటర్, ఐదు చెక్కల విత్తనం, ఎరువు వేసే పరికరం, పంట నూర్పిడి, క్రిమి సంహారక మందు పిచికారీ యంత్రాలు రైతులకు ఎంతో ఉపయోగపడు తున్నాయి.

**శిక్షణ.. అవగాహన**

ఈ కేంద్రంలో పని చేసే శాస్త్రవేత్తలు ప్రతి నెల రైతులకు పంటల సాగులో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై శిక్షణ కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. చీడ, పీడల యాజమాన్యంపై అవగాహన కల్పిస్తున్నారు. అంతేగాకుండా చుట్టుపక్కల రైతులు వేసిన పంట పొలాలను పరిశీలించి వాటికి రైతులు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరిస్తున్నారు. మట్టి, నీటి నమూనాల పరీక్షలు నిర్వహించి అధిక దిబడులు సాధించేందుకు రైతులను ప్రోత్సహిస్తున్నారు.

**పత్తికి పుణ్యక్షేత్రాల పేర్లు**

జిల్లాలో రైతులు అధిక విస్తీర్ణంలో వరి, శనగ, పత్తి పంటలు సాగు చేస్తారు. ఈ మేరకు పత్తి రైతులకు నాణ్యమైన విత్తనాలను అందించేందుకు ఇక్కడ ఎన్నో పరిశోధనలు చేసి నూతన వంగడాలను సృష్టించారు. 2012లో శివనంది, శ్రీరామ 2015-16లో ఉత్పత్తి చేశారు. వీటికి నరసింహ, శివనంది, యాగంటి, అరవింద, శ్రీనంది వంటి పేర్లు పెట్టడానికి ఇక్కడ ప్రసిద్ధి గాంచిన దేవాలయాలు ఉండటం కారణం. అరవింద, శివనంది రకాలకు ఎర్రనేలలు, యాగంటి, నరసింహ, శ్రీరామ రకాలకు నల్లరేగడి నేలలు అనువైనవి. రసం పీల్చే పురుగులు, కాయతొలిచే పురుగులు, గులాబీ రంగు పురుగును ఈ వంగడాలు ఎదుర్కొంటాయి. ఎకరాకు 8 నుంచి 14 క్వింటాళ్ల దిగుబడి వస్తుంది. శ్రీరామ రకం పంట విత్తనాలు ఏడు రాష్ట్రాలకు ఎగుమతి అయి ఆ రాష్ట్రాల్లో పంటలు పండిస్తున్నారు.

**సన్నని సోనాలు**

నంద్యాల ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా స్థానం నుంచి 2016లో విడుదలైన నంద్యాల సోనా రాష్ట్ర వ్యాప్తంగా పేరుగాంచింది. నంద్యాల సోనా కాలపరిమితి 130 నుంచి 140 రోజులు ఉంటుంది. గింజ చాలా సన్నగా ఉండి బియ్యం రుచిగా ఉంటుంది. ఈ బియ్యంలో ఇతర బియ్యాన్ని కల్తీ చేయడానికి సాధ్యం కాదు. వీటికి చీడపీడ తెగుళ్లు తక్కువ, అగ్గితెగులు, ముడత తెగులును తట్టుకుంటాయి. ఎకరాకు 35 నుంచి 45 క్వింటాళ్లు దిగుబడి వస్తుంది. కర్నూలు, కడప, గుంటూరు, నిజామాబాద్, రంగారెడ్డి, కర్ణాటక వంటి ప్రాంతాల్లో నంద్యాల సోనా బాగా ప్రాచుర్యం పొందింది.

**నాణ్యమైన పొగాకు**

1992లో తూర్పుగోదావరి జిల్లా వెంకటరామన్న గూడెం నుంచి అఖిత భారత పొగాకు సమన్వయ పథకం నంద్యాల ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా స్థానానికి మార్చారు. నంద్యాల పొగాకు-1 2015లో ఉత్పత్తి చేశారు. మూడు కేజీల విత్తనాలు ఎకరాకు నారువేస్తే 150 నుంచి 200 ఎకరాలకు విత్తనాలు వస్తాయి. అదేవిధంగా నాటు పొగాకు, బీడీ పొగాకులు పరిశోధనల సహకారంతో విడుదల చేశారు. ఈ పంటను సెప్టెంబర్, అక్టోబర్ నెలలో 70 సెం.మీ దూరంలో మొక్క నాటుకోవడం వలన అధిక దిగుబడులు వస్తాయి. రసం పీల్చే పురుగు, లద్దెపురుగు వంటి వాటిని ఈ పంట తట్టుకుంటాయి. ఈ పంటలపై అధిక దిగుబడి, నాణ్యతలపై పరిశోధనలు పురోగతిలో ఉన్నాయి.

**బెస్ట్ పరిశోధన కేంద్రంగా అవార్డులు**

'నంద్యాల వ్యవసాయ పరిశోధన కేంద్రంలో 14 సంవత్సరాలు పని చేశాను. 12 సంవత్సరాలు శాస్త్రవేత్తగా, రెండు సంవత్సరాలు ఏడీఆర్‌గా పని చేశా. నా హయాంలో శనగలు నాలుగు రకాలు, కొర్రలు మూడు రకాలు, జొన్నలు రెండు రకాలు, పొగాకు ఒక రకం వంగడాలను విడుదల చేశాను. నా హయాంలో విడుదల చేసిన నంద్యాల సోనా బియ్యానికి రాష్ట్ర వ్యాప్తంగా మంచి డిమాండ్ ఉంది. రాష్ట్రంలో పది పంటలపై పరిశోధనలు చేసి కొత్త వంగడాలను సృష్టిస్తున్న ఒకే ఒక పరిశోధన స్థానం నంద్యాల ఆర్‌ఏఆర్‌ఎస్ ప్రాంతీయ కేంద్రమే' అని విశ్రాంత ఏ డి ఆర్ శ్రీ గోపాల్‌రెడ్డి తెలిపారు. ■

కాదనడం కంటె పట్టించుకోక పోవడం , నిర్లక్ష్యం చేయడమే మరింత అవమానకరం

# ఐదు సిరి ధాన్యాలతో ఆరోగ్యం పదిలం !

ప్రజల ఆహారపు అలవాట్లలో భారీ మార్పులతో సంప్రదాయ, చిరుధాన్యపు పంటలకు స్థానం లేకుండా పోయిందని, విదేశీ సంస్కృతి, ఆహారపు అలవాట్లు భారతదేశ ప్రజలపై బలవంతంగా రుద్ది వాణిజ్యపరంగా సొమ్ము చేసుకుంటున్నారని కృషిరత్న అవార్డు గ్రహీత, మైసూరుకు చెందిన ప్రఖ్యాత స్వతంత్ర శాస్త్రవేత్త డాక్టర్ ఖాదర్‌వలి పేర్కొన్నారు. ఇటీవల అనంతపురంలో అనంత పర్యావరణ పరిరక్షణ సమితి, వ్యవసాయ సాంకేతిక యాజమాన్య సంస్థ (ఆత్మ), ఏపీ కరువు నివారణ పథకం (ఏపీ డీఎంపీ), నాబార్డు, సెరా తదితర శాఖలు, సంస్థలు సంయుక్తంగా ఏర్పాటు చేసిన సదస్సుకు డాక్టర్ ఖాదర్ వలి ముఖ్య అతిథిగా హాజరయ్యారు.




ప్రజలకు ఆరోగ్య సలహాలు ఇచ్చారు. ఈ సందర్భంగా ఖాదర్‌వలి మాట్లాడుతూ సంప్రదాయ పంటలు కనుమరుగై, రైతులకు వ్యవసాయం భారమై ఆత్మహత్యలు చేసుకోవాల్సిన దుస్థితి ఏర్పడిందన్నారు. ప్రజలు అనేక వ్యాధుల బారిన పడుతూ సంపాదన అంతా వైద్యానికే ఖర్చు చేసుకోవాల్సి వస్తోందన్నారు.

**సిరిధాన్యాలతో సంపూర్ణ ఆరోగ్యం**

ప్రకృతి ప్రసాదించిన ఐదు రకాల సిరిధాన్యాలతో మనిషి సంపూర్ణ ఆరోగ్యంగా ఉంటారని డాక్టర్ ఖాదర్ వలి తెలిపారు. కొర్రలు, (ఫాక్స్‌టైల్ మిల్లెట్), అరికలు (కోడో మిల్లెట్), సామలు (లిటిల్ మిల్లెట్), ఊదలు (బార్న్‌యార్డ్ మిల్లెట్)... ఈ ఐదు రకాలతో చేసిన అన్ని ఆహార పదార్థాలూ మానవ ఆరోగ్యానికి ఎంతగానో మేలు చేస్తాయన్నారు. పిల్లల నుంచి వయోవృద్ధుల వరకు వీటిని తీసుకుంటే అన్నిరకాల జబ్బులు, ప్రాణాంతక, భయంకర వ్యాధులు, మానసిక రుగ్మతలు సైతం మటుమాయమవుతాయన్నారు.

**చిరుధాన్య వంటలకు దూరమై ఆరోగ్య సమస్యలు**

కొర్రల ద్వారా 18 రకాలు, అండుకొర్రల ద్వారా 8 రకాలు, అరికల ద్వారా నాలుగు... ఇలా వీటి ద్వారా అనేక రాల ఆహార పదార్థాలు తయారు చేసుకోవచ్చని డాక్టర్ ఖాదర్ వలి తెలిపారు. వైద్యులకు కూడా సాధ్యం కాని రోగాలు వీటి ద్వారా నయం చేసుకోవచ్చన్నారు. కేన్సర్ లాంటి ప్రాణాంతక వ్యాధులు సైతం దరిచేరవన్నారు. ఆధునిక సమాజంలో ప్రజలు వీటికి దూరమై ఆరోగ్య సమస్యలు కొని తెచ్చుకొని సంపాదన మొత్తం వైద్యానికే వెచ్చించాల్సిన పరిస్థితి నెలకొందన్నారు.

**విచ్చలవిడిగా రసాయనాల వాడకంతో ముప్పు**

విదేశీ సంస్కృతి ఆహారపు అలవాట్లు పెరగడంతో దేశంలో ప్లాస్టిక్ వినియోగం ఎక్కువై దానివల్ల ఎన్నో అనర్థాలు జరుగుతున్నాయని ఖాదర్‌వలి అన్నారు. ప్రస్తుత పరిస్థితుల్లో పాలు, కాఫీ, టీ, గ్రుడ్లు, చక్కెర, బెల్లం, బియ్యం, గోధుమలు, మాంసం, రీఫైన్డ్ ఆయిల్స్, పాలిష్ ఉత్పత్తులు, అల్యూమినియం పాత్రలు, నాన్‌స్టిక్ వస్తువులు, ప్లాస్టిక్ డబ్బాలు లాంటివాటిని పూర్తిగా పక్కన పెట్టాలన్నారు. విచ్చలవిడిగా రసాయనాలు, పురుగు మందులు, యాంటీబయాటిక్స్, స్టెరాయిడ్స్ వాడటం వల్ల వీటిలో విష పదార్థాలు పెరిగి అనేక వ్యాధులకు కారణమవుతున్నాయన్నారు. ఇప్పుడున్న పరిస్థితుల్లో తల్లిపాలు తప్ప మరే పాలు తీసుకున్నా హానికరమేనన్నారు.

కార్యక్రమంలో నాబార్డు డీడీఎం ఉషామధుసూదన్, వ్యవసాయ మిషన్ సభ్యులు డాక్టర్ వైవీ మల్లారెడ్డి, బోయ రాజారాం, ప్రొఫెసర్ గంగిరెడ్డి, ఏడీఏ యల్లప్ప, ఎన్‌జీవోలు కుల్లాయిస్వామి, భాగ్య, ఆదరణ రామకృష్ణ, వాసన్ ఎన్‌జీవో ప్రతినిధులు, పెద్ద ఎత్తున ప్రజలు పాల్గొన్నారు. ■

# సిరి ధాన్యాలను వైద్యానికి జోడించి ... !

వైద్యుడు అనారోగ్యాన్ని తగ్గించడం గురించి మాత్రమే కాదు, ఆరోగ్యాన్ని అందించే సరైన ఆహారం గురించి, ఆ ఆహారం పండించే పద్ధతుల గురించి కూడా పట్టించుకోవాలంటున్నారు డాక్టర్ ధర్మకారి రాంకిషన్. మహబూబ్‌నగర్ ప్రభుత్వ ఆసుపత్రి సూపరింటెండెంట్‌గా పనిచేస్తున్న ఆయన చాలాకాలంగా నల్లమల ప్రాంత చెంచుల గ్రామాల్లోకి వెళ్లి వైద్య శిబిరాలు నిర్వహిస్తూ ఉంటారు. గత రెండేళ్లుగా సిరిధాన్యాలనే ఆహారంగా తింటూ.. వందలాది మంది రోగులకూ ఈ ఆహారాన్ని అలవాటు చేసి దీర్ఘవ్యాధుల నుంచి వారిని విముక్తం చేస్తున్నారు.

అంతేకాదు.. స్వయంగా 20 ఎకరాల్లో సిరిధాన్యాలను వర్షాధారంగా పండిస్తున్నారు. మహబూబ్‌నగర్, నాగర్‌కర్నూల్ జిల్లాల్లో కొందరు చెంచులు, ఇతర రైతులను ప్రోత్సహించి ఈ ఖరీఫ్ సీజన్‌లో 200 ఎకరాల్లో సిరిధాన్యాలను సాగు చేయిస్తున్నారు. 'చెంచులోకం' స్వచ్ఛంద సంస్థకు గౌరవాధ్యక్షుడు కూడా అయిన ఆయన ఐటీడీఏ తోడ్పాటుతో చెంచులతో సిరిధాన్యాల ప్రాసెసింగ్ యూనిట్లు, విక్రయ కేంద్రాలు ఏర్పాటు చేయించడానికి కృషిచేస్తున్నారు.

వచ్చే ఏడాది వెయ్యి ఎకరాల్లో సాగు చేయించాలని, సిరిధాన్యాల విత్తన బ్యాంకులను నిర్మించాలన్న దృఢ సంకల్పంతో ఉన్నారు. ఇందుకోసం 'రైతు లోకం ఫౌండేషన్'ను రిజిస్టర్ చేయించి టోల్ ఫ్రీ నంబరు ద్వారా సిరిధాన్యాలు ఆహార, ఆరోగ్య, వ్యవసాయ సంబంధమైన శాస్త్రీయ అవగాహనను ప్రజలకు అందించాలని అభిలషిస్తూ ఇతరులకు స్ఫూర్తినిస్తున్నారు.

డాక్టర్ ధర్మకారి రామ్‌కిషన్ అరుదైన ప్రజా వైద్యుడు. వృత్తి రీత్యా ఆయన ఎముకల శస్త్రచికిత్సా నిపుణుడు. వైద్య విద్యార్థులకు 20 ఏళ్లుగా పాఠాలు చెబుతున్న ప్రొఫెసర్. ప్రస్తుతం మహబూబ్‌నగర్ ప్రభుత్వ ఆసుపత్రి సూపరింటెండెంట్‌గా సేవలందిస్తున్నారు. ప్రవృత్తి రీత్యా అట్టడుగు వర్గమైన నల్లమల చెంచులకు ఆప్తుడు. చెంచులోకం స్వచ్ఛంద సంస్థకు గౌరవాధ్యక్షుడిగా చెంచుల పెంట(గూడేల) ల్లో వైద్య శిబిరాలు పెడుతూ వారికి అండదండగా ఉంటుంటారు.

గత రెండేళ్లుగా వరి, గోధుమలను తినటం నిలిపివేసి పూర్తిగా వర్షాధారంగా పండించిన సిరి ధాన్యాలనే తింటున్నారు. ప్రజావైద్యంలో సిరిధాన్యాలను మిళితం చేసి వందలాది మంది దీర్ఘ రోగులను సంపూర్ణ ఆరోగ్యం దిశగా నడిపిస్తున్నారు. బంధు మిత్రుల కుటుంబాలను కూడా కొర్రలు, సామలు, ఆరికలు, ఊదలు, అండుకొర్రలనే ముఖ్య ఆహారంగా, అంబలిగా, అల్పాహారంగా, చిరుతిండ్లుగా తీసుకోమని.. రోజూ 7–10



*తన పొలంలో ఊద పంటను పరిశీలిస్తున్న డా. రామ్‌కిషన్*

కిలోమీటర్లు నడవడం ద్వారా దీర్ఘరోగాల నుంచి కూడా విముక్తి పొంది సంపూర్ణ ఆరోగ్యం సంతరించుకోవచ్చని సూచిస్తూ సత్ఫలితాలు సాధిస్తున్నారు. స్వయంగా తాను 20 ఎకరాల్లో సాగు చేస్తున్నారు. అంతగా ఆదాయం లేక అల్లాడుతున్న వర్షాధార వ్యవసాయదారులను, చెంచులను నాలుగు వర్షాలు పడితే నిశ్చింతగా పండే ఈ సిరిధాన్యాల సాగుకు ఇతర ప్రోత్సహిస్తున్నారు. స్వతంత్ర శాస్త్రవేత్త డా. ఖాదర్ వలితో కూడా అనేక సదస్సులు నిర్వహించారు.

**పత్తి పొలాల మధ్య సిరిధాన్యాల సాగు**

నాగర్‌కర్నూల్ జిల్లా తాడూరు మండలం ఇంద్రకల్ డాక్టర్ రామ్‌కిషన్ సొంత గ్రామం. అక్కడే ఆయనకు రెండెకరాల పొలం ఉంది. మరో 18 ఎకరాల నల్లరేగడి భూమి కౌలుకు

పంచితే పెరిగేది ప్రేమ , ఇతరులకు ఎంత ప్రేమను పంచితే మనకు అంత దక్కుతుంది

తీసుకొని మొదటి సారిగా ఈ ఏడాదే 5 రకాల సిరిధాన్యాలు ... కొర్రలు, సామలు, అరికలు, ఊదలు, అండుకొర్రలను సాగుచేశారు. చుట్టూ పత్తి పొలాల మధ్యలో తమ సిరిధాన్యాల పంటలు చూస్తుంటే ముచ్చటగా ఉందని ఆయన సంబరపడుతున్నారు. విత్తనం చల్లటం తప్ప చేసిందేమీలేదు. కలుపు కూడా ఉంది. కానీ, అది పంట ఎదుగుదలకు ఆటంకం కాలేదని డా. రామ్ కిషన్ చెప్పారు.

**ఉచితంగా సిరిధాన్యాల విత్తనాలు**

సిరిధాన్యాల సాగులో అనుభవం లేనందున కడప జిల్లాకు చెందిన 'విఆర్‌డిఎస్' స్వచ్ఛంద సంస్థ వ్యవస్థాపకుడు, రైతు శాస్త్రవేత్త శ్రీ కొమ్ములూరి విజయకుమార్‌ను డాక్టర్ రామ్‌కిషన్ తమ ప్రాంతానికి ఆహ్వానించి ఆయన సహాయ సహకారాలు తీసుకున్నారు. విజయకుమార్ ఈ ప్రాంతంలో పర్యటించి డాక్టర్ రామ్‌కిషన్ చెంచులు, మెట్ట రైతుల అభ్యున్నతికి చేస్తున్న కృషికి ముగ్ధుడయ్యారు. 50 ఎకరాల్లో సిరిధాన్యాల సాగుకు అవసరమైన సేంద్రియ విత్తనాలను విజయకుమార్ డా. రామ్‌కిషన్ ద్వారా ఉచితంగా అందించి, సిరిధాన్యాల సాగులో మెలకువలను తెలియజెప్పారు. వంద ఎకరాలకు విత్తనాన్ని ఐటిడిఏ ఉచితంగా పంపిణీ చేసింది.

వీరి సహకారంతో తాడూరు మండలం ఇంద్రకల్‌కు చెందిన ఇంజినీరింగ్ పట్టభద్రుడు ప్రశాంత్ తొలిసారిగా ఈ ఏడాది 30 ఎకరాల్లో సిరిధాన్యాలు సాగు చేస్తున్నారు. ఎక్కువ విస్తీర్ణంలో అండుకొర్రలు, సామలు, అరికలు సాగు చేస్తున్నారు. అదేవిధంగా తాడూరు మండలం యాదిరెడ్డి కాలనీకి చెందిన మర్రెడ్డి, శౌర్రెడ్డి, అనిల్ తలా ఒక రెండెకరాల్లో ప్రయోగాత్మకంగా సిరిధాన్యాలు సాగు చేశారు. అధిక పెట్టుబడులతో జూదంగా మారిపోయిన పత్తి కన్నా సిరిధాన్యాల సాగు మేలన్న భావనతో వచ్చే ఏడాది మరిన్ని ఎకరాల్లో సాగు చేస్తామని వారు చెబుతున్నారు.

మహబూబ్‌నగర్ మండలం తాటికొండ శివారులో వరి రైతు శంకర్ తొలిసారిగా 6 ఎకరాల్లో సిరిధాన్యాలను సాగు చేస్తూ ఆనందాన్ని వ్యక్తం చేస్తున్నారు. లింగాల మండలం అప్పాయపల్లి, శ్రీరంగాపురంలలో కూడా డా. రామ్‌కిషన్, విజయకుమార్ ప్రోత్సాహంతో కొందరు రైతులు సిరిధాన్యాల సాగుకు శ్రీకారం చుట్టారు. ఆముదం, వరి సాగు చేసే అలవాటున్న చెంచు మహిళా రైతు శీతమ్మ ఈ ఏడాది 3 ఎకరాల్లో సిరిధాన్యాలు సాగు చేస్తున్నారు. లింగాల మండలం దారారంలో చెంచు రైతు కాట్రాజ శ్రీనివాస్ 12 ఎకరాల్లో కొర్రలు సాగు చేస్తున్నారు. వనపర్తి జిల్లా పెబ్బేరు మండలం శ్రీరంగాపురంలో శ్రీనివాస్ అనే రైతు 5 ఎకరాల్లో కొర్రలు సాగు చేస్తున్నారు. జోగులాంబ గద్వాల జిల్లా ఐజ గ్రామ శివారులో రామకృష్ణ 8 ఎకరాల్లో కొర్రలు సాగు చేస్తున్నారు.

ఈ విధంగా సుమారు 200 ఎకరాల్లో ఈ ఏడాది డా. రామ్‌కిషన్ ప్రోత్సాహంతో రైతులు సిరిధాన్యాల సాగును ప్రారంభించారు. గ్రామాల్లో 40-50 చోట్ల రైతుల గ్రూప్ మీటింగ్‌లు ఏర్పాటు చేసి వర్షాధారంగా సిరిధాన్యాల సాగు ఆవశ్యకత గురించి రైతులను చైతన్యవంతం చేయడం విశేషం. ఎకరానికి కనీసం 10 క్వింటాళ్ల దిగుబడి వస్తుందని అంచనా వేశామని, కనీసం రూ. 30 వేల ఆదాయం వస్తుందన్నారు. ఎకరానికి రూ. 50 వేలు పెట్టుబడి పెట్టి 6 నెలల పంటకాలం ఉండే పత్తి వేసి నానా బాధలు పడేకన్నా స్వల్ప పెట్టుబడితో 100 రోజుల్లో చేతికి వచ్చే సిరిధాన్యాల వర్షాధార సాగు మేలని రైతులు సంతృప్తిగా చెబుతున్నారని డా. రామ్‌కిషన్ తెలిపారు.

**చెంచులతో ప్రాసెసింగ్ యూనిట్లు**

సిరిధాన్యాల సాగు సంతృప్తికరంగా ఉన్నందున ప్రాసెసింగ్ విషయాలపై డాక్టర్ రామ్‌కిషన్ దృష్టి సారిస్తున్నారు. ఐటీడీఏ తోడ్పాటుతో రెండు చోట్ల చెంచు రైతుల ఆధ్వర్యంలో సిరిధాన్యాల శుద్ధి యంత్రాలను ఏర్పాటు చేసేందుకు ప్రయత్నిస్తున్నానని డా. రామ్‌కిషన్ తెలిపారు. అంతేకాదు, వర్షాధారంగా, సేంద్రియ పద్ధతుల్లో సాగు చేసే సిరిధాన్యాల విక్రయానికి ప్రత్యేక బ్రాండ్‌ను రిజిస్టర్ చేయించి, ప్రత్యేక దుకాణాల ద్వారా విక్రయం చేపట్టాలని ఆలోచిస్తున్నామన్నారు.

బోరు నీటితో పండించే వరి తదితర పంట దిగుబడుల్లో భార ఖనిజాలు ఉంటాయని, ఆ బియ్యం తిన్న వారికి కిడ్నీ జబ్బులు వస్తున్నాయని ఆయన తెలిపారు.


రామ్‌కిషన్‌ను 94407 12021 నంబరులో సంప్రదించవచ్చు. **(సాక్షి సౌజన్యంతో)** ■

**కొందరు కేవలం స్వార్థంతో , చిత్తం వచ్చినట్టు , పొంతనలేకుండా ప్రవర్తిస్తారు , ఐనా వారు ప్రేమార్హులే**

# ఆఫ్రికాలో హరిత నవీకరణ కేంద్రాలపై సదస్సుకు 'మాస్' ఎం డి

జి ఐ జడ్ ఆధ్వర్యంలో 'హరిత నవీకరణ కేంద్రాల' (గ్రీన్ ఇన్నొవేషన్ సెంటర్స్- జి ఐ సి) పై ప్రతి ఏడాది ప్రాంతీయ సదస్సు నిర్వహిస్తుంటారు. ఈ ఏడాది ఈ సదస్సు ఆగ్నేయ ఆఫ్రికాకు చెందిన మలావిలోని లిలోంగ్వేలో సెప్టెంబర్ 17-20 తేదీలలో జరిగింది. ఆంధ్రప్రదేశ్‌లో జి ఐ సి లను నిర్వహిస్తున్న మాస్ సంస్థ ప్రతినిధిగా మాస్ ఎం డి , సి ఇ ఓ శ్రీ సి ఎస్ రెడ్డి ఈ సదస్సుకు హాజరైనారు. 'గ్రామీణ ఆకర్షణలు, పరివర్తనకు అవకాశాలు' అనేది ఈ ఏడాది సదస్సు ప్రధాన చర్చనీయాంశం. వివిధ దేశాలలో జి ఐ జడ్ భాగస్వామ్య సంస్థలకు చెందిన దాదాపు 200 మంది ప్రతినిధులు ఈ సదస్సులో పాల్గొన్నారు. ప్రధాన చర్చనీయాంశంతోపాటు అందుకు సంబంధించిన ఐదు ఉప చర్చా గోష్ఠులను (ప్యానల్ డిస్కషన్స్) కూడా నిర్వహించారు. తొలిరోజు 17 వ తేదీన ' గ్రామీణ పరివర్తన- హరిత నవీకరణ కేంద్రాల పాత్ర' అనే అంశంపై జరిగిన చర్చాగోష్ఠిలో శ్రీ సి ఎస్ రెడ్డి ప్రసంగించారు.

**ఎఫ్ పి ఓ లపై న్యాయ నిర్ణేతగా ...**




ప్రసిద్ధ 'ఎకనమిక్ టైమ్స్' పత్రిక ఎఫ్ పి ఓ లపై ఢిల్లీలో అక్టోబర్ 18 వ తేదీన శిఖరాగ్ర సదస్సు నిర్వహించి, అవార్డులను ప్రదానం చేయనున్నది. ఎకనమిక్ టైమ్స్ ఆహ్వానం మేరకు ఈ సదస్సులో మరి ఇద్దరితోపాటు శ్రీ ఎస్ రెడ్డి న్యాయ నిర్ణేతగా వ్యవహరిస్తారు.

**సహకార సంస్థలపై సదస్సు ...**

రవాండాలోని కలిగిలో ఇంటర్నేషనల్ కో-ఆపరేటివ్ అలయెన్స్ నేతృత్వంలో అక్టోబర్ 13-18 తేదీలలో 'అభివృద్ధి కోసం సహకార సంస్థలు' అనే అంశంపై అంతర్జాతీయ సదస్సును నిర్వహించనున్నది. శ్రీ సి ఎస్ రెడ్డి ఈ సదస్సులో ఆహ్వానితుడుగా పాల్గొని ప్రధాన ప్రసంగం చేస్తారు

కర్ణాటకకు చెందిన ప్రముఖ ఎన్ జి ఓ 'శ్రీ క్షేత్ర ధర్మస్థల రూరల్ డెవలప్ మెంట్ ప్రాజెక్ట్ ' (ఎస్ కె డి ఆర్ డి పి)అక్టోబర్ 31-నవంబర్ 2 వ తేదీ మధ్య ఎస్ హెచ్ జి ఉద్యమంపై అంతర్జాతీయ సదస్సును నిర్వహించనున్నది.ఏ సదస్సులో ' ఎస్ హెచ్ జి ఉద్యమంలో మానవ వనరులు' అనే అంశంపై జరిగే చర్చాగోష్ఠికి శ్రీ సి ఎస్ రెడ్డి అధ్యక్షత వహిస్తారు.



సెప్టెంబర్ నెలలో ధర్మస్థలలో జరిగిన ఒక సమావేశంలో శ్రీ సి ఎస్ రెడ్డి ప్రసంగించారు. ఆ సందర్భంగా ఆయనను వారు సన్మానించారు. ■

## సమతుల ఆహారం అవసరం

సమతుల ఆహారం శరీరానికి శక్తినిస్తుందని మహిళాభివృద్ధి సొసైటీ ప్రాజెక్ట్ అధికారి భవాని తెలిపారు. జాతీయ పోషణ మాసోత్సవాల్లో భాగంగా హైదరాబాద్ పాత మలక్‌పేట డివిజన్‌లోని శంకర్‌నగర్‌లో ఆహార వైవిధ్య మేళాను నిర్వహించారు. ఆకుకూరలు, కూరగాయలు, పండ్లు, తృణధాన్యాలను ప్రదర్శించి వాటితో కలిగే ప్రయోజనాలను వివరించారు. నిత్యం తీసుకునే ఆహార పదార్థాల్లో ఏవిధమైన పోషక పదార్థాలు ఉన్నాయి, శరీరానికి కావాల్సిన పౌష్టికాహారాన్ని తీసుకుంటున్నామా లేదా అనే విషయాలు మహిళలు తెలుసుకోవాలన్నారు. కార్యక్రమంలో సొసైటీ ప్రోత్సాహికులు రాజోజుల బ్రహ్మాచారి, సామాజిక కార్యకర్తలు అరుణ, మాధవి, సునీత, అంగన్‌వాడీ టీచర్ భాగ్య, నాస్కా, సుమిత్ర, సమాఖ్య సభ్యులు మంగ, రమ్య అలివేలు, బాబూరావు, జనార్ధన్, మహేందర్, ఆశావర్కర్లు పాల్గొన్నారు. ■

# హైదరాబాద్, తిరుపతి, ఒంగోలులో పోషకాహార మాసోత్సవాల చిత్రమాలిక

















MAHILA SADHIKARATHA
Publication Date: 01-10-2019; Posting Date: 05-10-2019

RNI Regd No: TELTEL / 2003 /16365
Postal Regd No: HD/1064/2018-20







హైదరాబాద్ మాస్ కార్యాలయంలో 'ఎనేబుల్ ' రెండు రోజుల వర్క్‌షాప్ దృశ్యాలు





మాల్వీలోని లినోంగ్వీలో హరిత నవీకరణ కేంద్రాలపై జి ఐ జడ్ నిర్వహించిన సదస్సులో మాస్ ఎండి శ్రీ సి ఎస్ రెడ్డి





చిత్తూరు జిల్లా రామసముద్రం మండలంలో జి ఐ జడ్ పరిశీలకుల బృందం పర్యటన





మాస్ - అపార్డ్ సంయుక్త బృందం పరిశీలన దృశ్యాలు





పీలేరు ఎఫ్ పి ఓ డైరెక్టర్ల సమావేశం

బట్వాడా కాకపోతే దయచేసి
ఈ చిరునామాకు తిప్పిపంపండి

ఎడిటర్, ఏపిమాస్ కార్యాలయం, ప్లాట్ నెం.11-12, హుడా కాలని, తానీషా నగర్,
డ్రీమ్ వ్యాలీ దగ్గర, మణికొండ, రంగారెడ్డి జిల్లా, హైదరాబాదు-500089